ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు
3
మంగళవారం 11 జూన్ 2024



● కంపచెట్ల గ్రహణం వీడిన తరువాత ఆలిండియా సర్వీసెస్ అధికారుల భవన సముదాయం, ఎమ్మెల్యే క్వార్టర్స్



# రాజధానికి.. జీవం

● యుద్ధ ప్రాతిపదికన సాగుతున్న రాజధాని పనులు ● కూటమి గెలిచిన మరుక్షణం నుంచి మొదలైన పనులు ● రోడ్లు, ప్రభుత్వ భవనాలకు వీడుతున్న గ్రహణం ● సగానికి పైగా పూర్తయిన జంగిల్ క్లియరెన్స్ పనులు ● త్వరలో ప్రారంభం కానున్న భవన సముదాయ పనులు ● కొత్త కాంతులతో కళకళ లాడుతున్న నవ్యాంధ్ర రాజధాని

**ఐదేళ్లు.. రాజధాని అమరావతికి వైసీపీ ప్రభుత్వం గ్రహణం పట్టించింది. ఇప్పుడా గ్రహణం వీడింది. కూటమి గెలుపుతో అమరావతి రాజధాని ఊపిరి పీల్చుకుంది. దీంతో రాజధాని నగరాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇప్పటి వరకూ రాజధాని గ్రామాలవైపు ముఖం కూడా చూపని సీఆర్డీఏ అధికారులు రాజధాని రోడ్లపై ఉరుకులు పరుగులు పెడుతూ ఆగమేఘాల మీద పనులను పరుగులు పెట్టిస్తున్నారు. కొత్త కాంతులతో నవ్యాంధ్ర రాజధాని కళకళ లాడుతోంది. ఇప్పటివరకూ కంప చెట్లతో కనుమరుగైపోయిన ఆ ప్రాంతం ఇప్పుడు కొత్త శోభ దిద్దుకుంది.**

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతికి పూర్వ వైభవం రాబోతోంది. ఐదేళ్ల క్రితం మొదలైన రాజధాని గ్రహణం ఎట్టకేలకు వీడిపోయింది. మూడు రాజధానుల పేరుతో రాజధాని రైతులకు ఐదేళ్లుగా నరకం చూపించిన అధికార వైసీపీ ఓటమిపాలవడంతోనే రైతులకు మంచిరోజులు వచ్చాయి. అయితే వారంతా కొత్త ప్రభుత్వం కొలువుదీరాక రాజధాని పనులు మొదలవుతాయని భావించారు. కానీ అడగకుండానే ఆకలి తీర్చే అమ్మ లాగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయక ముందే రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించారు. తనకు రాజధాని అమరావతి నిర్మాణం ఎంతటి ప్రాణప్రదమో ఆయన చెప్పకనే చెప్పారు. ఒక్క మాట కూడా మాట్లాడకుండానే పనులు ప్రారంభించి రైతుల కళ్లలో కాంతులు నింపారు. దీంతో రాజధాని నగరాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రైతుల మొహాల్లో నవ్వులు విరబూస్తున్నాయి.

### నాడు శిథిల స్వప్నంలా రాజధాని రోడ్లు

గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో రాజధానిలో చీకట్లు అలముకున్నాయి. మూడు రాజధానుల అంశాన్ని ముందుకు తెచ్చి అమరావతిని అంతం చేయాలని భావించిన ప్రభుత్వం నగర నిర్మాణాన్ని పూర్తిగా వదిలేసింది. ముళ్ల కంపలు, శిథిలమైన రోడ్లు, ఆగిపోయిన భవనాలు తప్ప మరేమీ కనిపించేవి కావు. రాజధానిలో కంపచెట్లు పెరిగిపోవడంతో చాలాచోట్ల భవనాలు, రోడ్లు కూడా కనిపించకుండా పోయాయి. రాజధానిలో పనులు ఆగిపోవడంతో ఆ వైపు చూసేవారు కూడా లేక నవనగరాలు నిర్మానుష్యంగా తయారయ్యాయి. రోడ్లు ధ్వంసమైపోయాయి. సామాగ్రి దొంగలపాలైపోయింది. కంపెనీలు వెనక్కి వెళ్లిపోయాయి. భవనాలు శిథిల శిల్పాల్లా మిగిలిపోయాయి. కానీ నాలుగు రోజులుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొత్త ప్రభుత్వం అధికారికంగా ఇంకా కొలువు దీరక ముందే పనులు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటి వరకూ రాజధాని గ్రామాలవైపు ముఖం కూడా చూపని సీఆర్డీఏ అధికారులు రాజధాని రోడ్లపై పరుగులు పెడుతూ ఆగమేఘాల మీద పనులను పరుగులు పెట్టిస్తున్నారు. స్వయంగా రాష్ట్ర అత్యున్నత అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొదలు, ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వరకూ అధికారులు స్వయంగా అమరావతిలో పర్యటిస్తూ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. దగ్గరుండి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రాజధాని గ్రామాల్లో పనులు రాకెట్ వేగంతో ముందుకు సాగుతున్నాయి.

### ప్రభుత్వ భవనాలకు రోడ్డు క్లియరెన్స్

ఐదేళ్లుగా నిర్మాణం జరగకపోవడం ప్రభుత్వ భవనాలన్నీ శిథిలాలయాలుగా మారిపోయాయి. అటువైపు వెళ్లేందుకు దారి కూడా లేకుండా కంప చెట్లు రోడ్లపై మొలిచాయి. గడిచిన రెండు రోజుల్లో అధికారులు వాటిని తొలగించారు. భవనాల చుట్టూ పెరిగిన కంప చెట్లు పూర్తిగా తొలగించడంతో ఆకాశ హర్మ్యాలు అందంగా కనిపిస్తున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో అక్కడ కూడా పనులు ప్రారంభం కాబోతున్నాయని, మరో ఐదారు నెలల్లో అవి కూడా అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. కాగా ఐదేళ్ల క్రితం ఆగిపోయిన సీఆర్డీయే కార్యాలయం ఇప్పుడు ముగింపు దశకు చేరింది. దాదాపు రంగులు కూడా పూర్తై, మెరుగులు దిద్దేదశలో వుంది. ఇంటీరియర్ పనులు కూడా పూర్తి చేసి మరో రెండు నెలల్లో అక్కడి నుంచే కార్యకలాపాలు ప్రారంభిస్తారని తెలుస్తోంది. ఎమ్మెల్యే క్వార్టర్లు, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల భవనాలు దుమ్ము దులుపుకుని కనువిందు చేస్తున్నాయి.



లింగాయపాలెం రోడ్డులో విద్యుత్ లైన్ల పనులు

### రేయింబవళ్లూ కొనసాగుతున్న అభివృద్ధి పనులు

రాజధానిలో ఐదేళ్లుగా ఆగిపోయిన పనులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గత నాలుగు రోజులుగా పనులు ఆగకుండా శరవేగంగా సాగుతున్నాయి. గతంలో మాదిరిగా రేయింబవళ్లూ ఆగకుండా పనులు జరిపిస్తున్నారు. 29 గ్రామాల్లో 100కు పైగా పొక్లెయినర్లతో అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. అవీ సరిపోకపోవడంతో మరిన్ని పొక్లెయినర్లను తెప్పించి పనులు జరిపిస్తున్నారు. మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టిన అధికారులు రోడ్లు, విద్యుత్ సదుపాయాల కల్పనపై దృష్టిసారించారు. రోడ్లను శుభ్రం చేయడానికి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయడానికి వందలమంది పని చేస్తున్నారు. రాజధాని రవాణాకు ఆయువుపట్టైన సీడ్ యాక్సిస్ రోడ్డుకు సొబగులు అద్దుతున్నారు. వాడకం లేక శిథిలమై, మొక్కలు మొలిచిన రోడ్లను శుభ్రం చేస్తున్నారు. డివైడర్లపై వీధి దీపాలు ఏర్పాటు చేసి నవ నగరాల్లో కాంతులీనుతున్నాయి.

### శంకుస్థాపన ప్రాంతానికి మహర్దశ

ఉద్దండరాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన ప్రాంతం కళకళలాడుతోంది. ఇప్పటి వరకూ కంపచెట్లతో కనుమరుగైపోయిన ఆ ప్రాంతం ఇప్పుడు కొత్త శోభ దిద్దుకుంది. శిలాఫలకాలు, మ్యూజియం చుట్టూ వున్న కంపచెట్లను తొలగించి అందంగా తీర్చిదిద్దారు. అమరావతిలో పనులు వేగం పుంజుకోవడంతో రాకపోకలు కూడా పెరిగాయి. ఎప్పుడూ వెలవెలబోయే సీడ్ యాక్సిస్ రోడ్డు వాహనాల రాకపోకల తో కళకళలాడుతోంది. ఈ క్రమంలో రాజధానిలో అభివృద్ధి పనులు చూసేందుకు వచ్చే పర్యాటకులు సందడి కూడా మొదలయింది.



సీడ్ యాక్సిస్ రోడ్డు డివైడర్‌పై కంపచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



కంప చెట్లు తొలగించిన సెక్రటేరియట్ భవనాలకు వెళ్లే రోడ్డు



రంగులద్దుకున్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం



జంగిల్ క్లియరెన్స్ తరువాత శంకుస్థాపన ప్రాంతం

## అమరావతి.. జిగేల్

● సీడ్ యాక్సెస్ రోడ్డుకు పూర్వ వైభవం
● రాయపూడిలో 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ పనులు ప్రారంభం



రాయపూడిలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)
అమరావతికి ఐదేళ్ల అంధకారం వీడింది. మళ్లీ విద్యుత్ కాంతులీనుతున్నాయి. వైసీపీ పాలనలో అమరావతి విధ్వంసంతో చీకట్లు కమ్ముకున్నా.. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో.. రాజధాని పునరుద్ధరణ పనులు ప్రారంభంతో తిరిగి అమరావతి ప్రకాశిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఆర్‌డీఏ అధికారులు అమరావతిలోని రోడ్లకు విద్యుదీపాల పనులు చేపట్టారు. అమరావతికి ప్రధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డులో పనిచేయని విద్యుద్దీపాలను రెండురోజుల పాటు శ్రమించి మరమ్మతులు చేశారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో లైట్లను వెలిగించటంతో సీడ్ యాక్సెస్ రోడ్డు దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. విద్యుద్దీపాల వెలుగులను సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ స్వయంగా రాయపూడి వరకు వెళ్లి పరిశీలించారు.

### అమరావతిలో కోటి లీటర్ల 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ పనులు

అమరావతి రాజధానిలోని రాయపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏ అధికారుల సన్నద్ధమయ్యారు. సోమవారం సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వెళ్లి 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్‌ను సందర్శించారు. అమరావతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చేపట్టిన పనుల్లో ఇది కూడా ఒకటి. పనులు అసంపూర్తిగా ఉండటంతో.. దీనిని పూర్తి చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోజుకు కోటి లీటర్ల నీటిని పంపిణీ చేసే సామర్థ్యం ఈ 10 ఎంఎల్‌డీకి ఉంటుంది.



# పన్నెండున పండుగే


● సీఎం ప్రమాణ స్వీకారోత్సవం...
● జిల్లా అంతటా పండగ వాతావరణం
● ప్రభుత్వ కార్యాలయాలన్నింటికి విద్యుత్ దీపాలతో అలంకరణ
● 12న గన్నవరం వెళ్లేందుకు అన్ని చోట్ల అందుబాటులో బస్సులు
● రాయలసీమ నుంచి వచ్చే ప్రజలకు ఇక్కడ ఆతిథ్యం



విద్యుత్ వెలుగుల్లో బాపట్ల పురపాలక సంఘ కార్యాలయం

గుంటూరు, జూన్10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న దృష్ట్యా జిల్లా అంతటా పండగ వాతావరణం ప్రతిబింబించేలా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మూడు రోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించాల్సిందిగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి ఆదేశాలు అందాయి. అలానే ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి పరిమితంగా ప్రజలను అనుమతిస్తున్నందున జిల్లాలో ఎక్కడికక్కడ ఆ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు వీలుగా ఎల్ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీవీఐపీ, వీఐపీ పాస్‌లు పొందిన వారితో పాటు మరికొందరు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగే గన్నవరం వెళ్లేందుకు వీలుగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో నాలుగు ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం మూడో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీన బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని తొలుత అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయాలని భావించారు. ఇందుకోసం రాజధానిలోని పలు ప్రాంతాలతో పాటు మంగళగిరి ఎయిమ్స్‌ని కూడా పరిశీలించారు. అయితే ఆ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు ఇతర రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు హాజరు కాబోతున్న దృష్ట్యా భద్రతని పరిగణనలోకి తీసుకొని గన్నవరం విమానాశ్రయం సమీపంలోని ఐటీ పార్కు ప్రదేశాన్ని ఎంపిక చేశారు. అదే అమరావతి రాజధానిలో అయితే చాలా హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలానే వర్షం కురిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయానికి కేవలం కిలోమీటర్ దూరంలోనే ఉన్న ఐటీ పార్కు స్థలాన్ని ఖరారు చేశారు. కాగా సీఎం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి రాయలసీమ నుంచి 8 వేల మంది వరకు ప్రతినిధులు హాజరౌతారని అంచనా వేస్తున్నారు. వారికి తగిన ఆతిథ్య ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్ర టభుత్వం కలెక్టర్‌ని ఆదేశించింది. దాంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, ముస్లిం షాదీఖానా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలలో అతిథిగృహాలను వారికి కేటాయిస్తారు. వారంతా 11వ తేదీన సాయంత్రమే జిల్లాకు చేరుకొంటారు. ఈ నేపథ్యంలో వారికి వేర్వేరు చోట్ల బస ఏర్పాటు చేసి రాత్రి విందు, ఉదయం అల్పాహారం సరఫరా చేస్తారు. అనంతరం గన్నవరం వెళ్లేందుకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తారు. మరోవైపు ప్రభుత్వ కార్యాలయాలకు కొన్ని చోట్ల రంగులు వేస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి పండగ వాతావరణాన్ని ప్రతిబింబిస్తున్నారు. ముఖ్య కూడళ్లలో ఎల్ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



బాపట్ల : సచివాలయానికి విద్యుత్ వెలుగు

### బాపట్లలో జిల్లాలో..

బాపట్ల: చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మున్సిపల్ కమీషనర్ బి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలంయంతోపాటు 20 వార్డు సచివాలయాల భవన సముదాయాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూడురోజులపాటు విద్యుత్ వెలుగులలో ప్రభుత్వ కార్యాలయాలు ఉంటాయని అధికారులు తెలియజేశారు.



## పెమ్మసాని చంద్రశేఖర్‌కి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖని ప్రధాని మోదీ కేటాయించారు. సోమవారం మంత్రులకు శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తి కాగా ప్రాధాన్యం కలిగిన శాఖని పెమ్మసానికి కేటాయించడంపై ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమౌతోంది. ఆయన సహకారంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు సమూలంగా అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రెయిన్ లు, వంతెనలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. సుదీర్ఘకాలం తర్వాత కేంద్ర మంత్రివర్గంలో గుంటూరు జిల్లాకు ప్రాతి నిధ్యం లభించింది. కాగా గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి ఏ శాఖని కేటాయిస్తారోనన్న చర్చ సోమవారం ఉదయం నుంచి జిల్లావ్యాప్తంగా జరిగింది. కాసేపు వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ఇస్తారని పార్టీ నాయ కులు, కార్యకర్తలు చర్చించుకొన్నారు. మరికొందరు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖలో సహాయ మంత్రి ఇస్తారని, తద్వారా అమరావతి రాజధానితో పాటు పట్టణప్రాంతాలకు మేలు జరుగుతుందని భావించారు. అయితే సాయంత్రం ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పెమ్మసానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ కేటాయించారు. ఈ శాఖ కూడా ప్రాధాన్యమైన వాటిల్లో ఒకటని భావిస్తున్నారు. ఉపాధి హామీ కార్యక్రమం ద్వారా పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయించి ఒకవైపు కూలీలకు పనులు, మరోవైపు అభి వృద్ధి పనులు చేయించే అవకాశం ఉంటుంది.

కమ్యూనికేషన్ల శాఖ కూడా ప్రాధాన్యం కలిగినదేనన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. నేడు ప్రపంచం అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ తదితర రంగాలు రాజ్యమేలుతున్నాయి. ఈ నేపథ్యంలో కమ్యూనికేషన్ల శాఖ కీలకమైనది. సాంకేతిక విప్లవాన్ని జిల్లాలోని యువత అందిపుచ్చుకొనే అవకాశాలను కల్పించే కార్యక్రమాలను అమలు చేయవచ్చు. ఈ రెండు శాఖలే కాకుండా కేంద్ర సహాయ మంత్రి హోదాలో ఇతర శాఖల మంత్రులను మెప్పించి, ఒప్పించి నిధులు మంజూరు చేయించే అవకాశం పెమ్మసానికి దక్కింది. ఈ అవకాశాన్ని ఆయన చక్కగా సద్వినియోగం చేసుకొని జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తారని అంతా ఆశిస్తున్నారు.

## శపథం నెగ్గించుకున్న చంద్రబాబు

● అన్నమాట ప్రకారమే ముఖ్యమంత్రిగా చంద్రబాబు

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): 'చంద్ర బాబు అంటే అది.. ఎక్కడైతే అవమానపడ్డారో.. అక్కడే సగర్వంగా తలెత్తుకు నిలబడ్డారు.. దటీజ్ చంద్రబాబు!' - ఇది రాజధాని రైతుల నోట వినిపిస్తున్న మాట! రాజధాని గ్రామాల్లో ప్రతిధ్వనిస్తున్న మాట! తెలుగుదేశం- జనసేన- బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని రీతిలో అనూహ్య విజయం పొందడం పట్ల రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాటి చంద్రబాబు శపథమే రాజధాని నిర్మాణానికి శ్రీరామ రక్ష అయిందని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో తమ తలరాతలు మారబోతున్నాయని వారు సంబరాలు చేసుకుంటున్నారు.

### అసెంబ్లీ సాక్షిగా శపథం..

గత ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి అన్న కనీస గౌరవం లేకుండా చంద్రబాబును తీవ్ర అవమానంపాలు చేశారు. అసెంబ్లీ సాక్షిగా నిరాధార నిందారోపణలు చేస్తూ, ఆయన సతీమణిని అవమానించడంతో ఆయన అసెంబ్లీ నుంచి శోకతప్తుడై బయటకి వచ్చారు. గుండెలు పగిలే ఆవేదనను అదుపు చేసుకోలేక కన్నీరు కార్చారు. బయటకు వచ్చే ముందు కౌరవ సభగా మారిన అసెంబ్లీని గౌరవ సభగా మార్చి ముఖ్యమంత్రిగా అడుగుపెడతానని శపథంచేశారు. ఆరోజున ఆయన చేసిన శపథం ప్రజల గుండెలను కదిలించి వేశాయి. ప్రజలంతా ఆయన వెంటే నిలిచారు. ఆయన శపథం నెరవేరేలా చరిత్ర ఎరుగని తీర్పునిచ్చారు. అధికార వైసీపీకి డిపాజిట్లు లేకుండా చేసి తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. అవమానాల్ని అధిగ మించి ఆత్మస్థైర్యంతో తాను నిలబడడమే కాకుండా, తాను తలపెట్టిన రాజధానిని, తనను నమ్మిన రైతాంగాన్ని కాపాడారని రైతులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. ఈ గెలుపు చంద్రబాబు గెలుపు మాత్రమే కాదని అది రాజధాని రైతుల, రాష్ట్ర ప్రజల గెలుపని అంటున్నారు.

### బాబును అవమానించారు



రాజధాని రైతులను వేధించడం, మాజీ ముఖ్య మంత్రి అన్న గౌరవం కూడా లేకుండా చంద్రబాబును అవమానించడం జగన్‌రెడ్డి చేసిన దిద్దుకోలేని తప్పు. చంద్ర బాబును అవమానించడం, ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరిని అల్లరిపాలు చేయాలనుకోవడమే వైసీపీకి శాపంగా మారింది. ప్రజలు తగిన బుద్ధి చెప్పారు.

- సురేంద్ర, అమరావతి అసైన్డ్ రైతు

### భువనేశ్వరి శాపం తగిలింది



ఏనాడు రాజకీయాల జోలికి రాని చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని వైసీపీ ప్రభుత్వం, జగన్ అనుచర గణం అవమానించాలని చూసింది. ఆమె శాపమే వారికి తగిలింది. అందుకే వారికి ప్రతిపక్ష స్థానం కూడా దక్కలేదు.

- కామినేని గోవిందమ్మ

## రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌కు టూటైర్ ఏసీ బోగి



రేపల్లె, జూన్ 10: తీరప్రాంత ప్రయాణికులకు రైల్వే అధికారులు డెల్టా ఎక్స్‌ప్రెస్‌కు టూటైర్ ఏసీ బోగీని అందు బాటులోకి తీసుకురావటం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ బోగిలో రేపల్లె కోటాలో 58 బెర్త్‌లు ఉండగా, ఒక్కో బెర్త్ ధర రూ.865గా రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ డెల్టా ఎక్స్‌ప్రెస్‌కు గతంలో థర్డ్ ఏసీ బోగి ఉండగా, అదనంగా టూటైర్ ఏసీ బోగిని ఏర్పాటు చేశారు.

# సివిల్స్ ప్రిలిమ్స్

దిక్సూచి DIKSUCHI

## GS Mock Questions

1. **Consider the following statements about Madurai, the capital city of the Pandya kingdom:**
1. It has been described in Maduraikkanchi as a large grand city, enclosed by walls on three sides and the cauvery river on the fourth side.
2. The Arthasastra mentions it as a centre of fine cotton textiles.
3. Other literary sources describe it as a major craft centre.
Which of the statements given above is correct?
a. 1 only b. 2 and 3 only c. 1 and 2 only d. 1, 2 and 3

2. **Consider the following statements about the Jorwe culture of the Deccan:**
1. It covers practically the whole of modern Maharashtra except the coastal Konkan district.
2. The Pravara-Godavari valleys seem to have been the nuclear zone.
3. The large sited if this culture yields evidence of shifting agriculture.
Which of the statements given above is correct?
a. 1 only b. 1 and 2 only c. 2 and 3 only d. 1, 2 and 3



3. **Man Kautuhal, a work on music, was prepared under the aegis of**
a. Raja Man Singh of Gwalior b. Tansen
c. Meerabai d. Amir Khusrau

4. **Which one of the following was not a part of the action programme of the Non - cooperation Movement?**
a. The congress organization was to the reach down the village and the Mohalla level.
b. Boycott of government affiliated schools and colleges.
c.Taking control of the law and order machinery of the state by the Congress working committee.
d. Surrender of titles and honors given by the government

5. **In the context of the Geological Survey of India (GSI) discovering vanadium reserves in India, consider the following statements:**
1. Vanadium is an abundant element in the earth's crust.
2. Vanadium is listed as one of the 30 critical minerals.
3. Titanomagnetite is the ore of vanadium.
4. India has the highest reserves of vanadium, while Brazil is the world's largest exporter of vanadium.
How many of the statements given above is correct?
a. Only One b. Only two c. Only three d. All four

6. **With reference to the Bochasanwasi Akshar Purushottam Swaminarayan Sanstha Mandir, recently inaugurated at Abhu Dhabi, consider the following statements:**
1. It is built in the traditional Vesara style of architecture.
2. Temple is surrounded by 'Dome of Harmony' and 'Dome of Peace.
3. The temple has been built using cement.
4. The temple houses seven shrines.
Which of the statements given above are correct
a) 1 and 3 only b) 1, 2 and 3 only
c) 2 and 3 only d) 2 and 4 only

7. **With reference to the Bharat Ratna award, consider the following statements:**
1. It is India's highest literary award.
2. The announcement of award recipients usually occurs annually on India's Independence Day.
3. The recommendations for Bharat Ratna are made by the Prime Minister to the President.
How many of the statements given above are correct?
a) Only one b) Only two c) All three d) None

8. **With reference to Subika painting, consider the following statements:**
1. It is a style of painting which is linked to the Meitei community's cultural history.
2. These paintings traditionally use handmade paper created from the bark of specific trees. Which of the statement(s) given above is/are correct?
a) 1 only b) 2 only c) Both 1 and 2 d) Neither 1 nor 2

9. **Which of the following cities was recently added to UNESCO's Creative Cities Network (UCCN)?**
a) Gwalior b) Junagadh c) Chittor d) Rishikesh

10. **Match List 1 and List 2 and select the correct answer using the code given below the lists:**

| List 1 (Political idea) | List 2 (Thinker) |
|---|---|
| A. Human beings, unlike All other objects, posses Dignity | 1. Aung San Suu Kyi |
| B. It is Swaraj when we learn To rule ourselves | 2. Subhas Chandra Bose |
| C. Freedom implies not only emancipation from political bondage but also, equal distribution of wealth | 3. Immanuel Kant |
| D. For me real freedom is freedom from fear | 4. Mahatma Gandhi |

Code:
a) A B C D / 3 2 4 1
b) A B C D / 1 4 2 3
c) A B C D / 3 4 2 1
d) A B C D / 1 2 4 3

11. **Renowned classical singer Prabha Atre, who passed away recently,was an expotent of which of the following gharanas?**
a. Kirana Gharana b. Patiala Gharana
c. Gwalior Gharana d. Agra Gharana

12. **At which of the following places was diamond mining carried put during the Delhi Sultanate period?**
a) Awadh b) Khambat c) Panna d) Laknauthi

13. **Consider the following the pairs:**

| S.no. | Author | Contribution |
|---|---|---|
| 1. | Dandin | Nitisara |
| 2. | Kamandaka | Dashakumara charitha |
| 3. | Vishakadatta | Mudrarakshasa |
| 4. | Patanjali | Mahabhashya |

How many of the following pairs is /are correctly matched?
a. Only one b. Only two c. Only three d. All four

14. **Consider the following the pairs:**

| S.No. | Location | Leader |
|---|---|---|
| 1. | Malabar | C.Rajagopalachari |
| 2. | Orissa | Bonsa Majhi |
| 3. | Dharsana | Imam Sahib |

How many of the following pairs is /are correctly matched?
a. Only one b. Only two c. Only three d. All four

15. **With reference to the colonial history of India, consider the following statements:**
1. The Frazer Commission on Police Reforms was established during the Viceroyalty of Lord Curzon.
2. Lord Curzon appointed the MacDonnell Commission to enquire into the results of famine operations.
3. The 'Kitchener Controversy', during the Viceroyalty of Lord Curzon, was related to the military reforms.
How many of the above statements is/are incorrect?
a. Only one b. Only two c. All three d.None

16. **With reference to the Silkyara Bend -Barkot Tunnel, consider the following statements:**
1. The silkyara Bend -Barkot Tunnel is being implemented through National Highways and Infrastructure Development Corporation Ltd. (NHIDCL).
2. Is falls along the National Highway (NH)-205.
3. It is a part of the 'Chardham Mahamarg Pariyojana'.
How many of the above statements is/are correct?
a. Only one b. Only two c.All three d. None

17. **With reference to Lake Victoria, consider the following statements:**
1. The lake 's area is divided among Tanzania, Uganda and Kenya, and Uganda occupies the maximum area of the lake.
2. The Equator passes through Lake Victoria.
3. The Kagera river drains into Lake Victoria.
How many of the above statements is /are correct?
a. Only one b. Only two c. All three d. None

**ANSWERS**

1. b 2. c 3. a 4. c 5. b 6. d 7. a 8. c 9. a 10. c 11. a 12. c 13. b 14. a 15. d 16. a 17. b

**Prepared by : CSB Academy, Hyderabad**

మరి కొన్ని ప్రశ్నలు 'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/kgTTMK5లో చదవండి.



## బ్లాక్ బస్టర్ కాంబినేషన్.. మరోసారి!

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీనివాస్.. ఈ కాంబినేషన్‌కు తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వీరిద్దరూ కలసి చేసిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' చిత్రాలు బ్లాక్ బస్టర్ హిట్ అయి, అత్యధిక వసూళ్లు సాధించి, సెన్సేషన్ క్రియేట్ చేశాయి. వీరిద్దరి కలయికలో మరో సినిమా ఎప్పుడా అని ఎదురు చూసేలా చేశాయి. ఆ ఎదురు చూపులకు తెర దించుతూ ఈ సినిమా వివరాలను బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ప్రకటించారు. 'లెజెండ్' చిత్రాన్ని నిర్మించిన రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ భారీ సినిమాను నిర్మించనున్నారు. బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని ఈ చిత్రానికి సమర్పకురాలు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ డివోషనల్ టచ్‌తో ఉంది. ఎర్రటి సూర్యుడు, పడుతున్న తోక చుక్కలు చూస్తుంటే బాలకృష్ణతో బోయపాటి మరో పవర్‌ఫుల్ సినిమా తీయబోతున్నారని అర్థమవుతుంది. అంతే కాదు బాలకృష్ణ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ సినిమా ఇదే. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.



## మరో పవర్‌ఫుల్ పాత్రలో బాలయ్య

నందమూరి బాలకృష్ణ సినిమా అంటేనే తెలుగు నాట ఉండే సందడే వేరు. ఇప్పుడు ఆయనతో చేతులు కలిపారు దర్శకుడు బాబీ కొల్లి. మాస్‌ని మెప్పించే కథాంశంతో ఆయన రూపొందిస్తున్న చిత్రం గ్లింప్స్‌ను బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని గ్లింప్స్‌ను చూస్తే అర్థమవుతుంది. 'జాలి, దయ, కరుణ లాంటి పదాలకు అర్థం తెలియని అసురుడు' అంటూ ఓ పవర్‌ఫుల్ డైలాగ్‌తో బాలకృష్ణ పాత్రను పరిచయం చేశారు. స్టైలిష్‌గా ఉంటూ అసలు సిసలు వయలెన్స్ చూపించే పాత్రలో బాలకృష్ణ కనిపించనున్నారు. తెలుగులో విజయవంతమైన చిత్రాలు నిర్మించే సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నారు. థమన్ సంగీతం, విజయ్ కార్తిక్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

## విజయ్ సేతుపతి నట విశ్వరూపం చూస్తారు



తమిళ నటుడు విజయ్ సేతుపతి నటించిన 50వ చిత్రం 'మహరాజా'. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, అభిరామి కీలక పాత్రలు పోషించారు. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరమ్, జగదీశ్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. సోమవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ "ఈ సినిమా విజయంపై అంతా నమ్మకంగా ఉన్నాం. తెలుగు ప్రేక్షకులందరికీ ఈ సినిమా నచ్చుతుంది" అని చెప్పారు. "మాస్, క్లాస్ ప్రేక్షకుల్ని అలరించే ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మహరాజా'. విజయ్ సేతుపతి నటవిశ్వరూపం ఇందులో చూస్తారు" అని నిర్మాత ఎన్వీ ప్రసాద్ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఫిలోమిన్ రాజ్, డీఓపీ: దినేశ్ పురుషోత్తమన్, సంగీతం: బి.అజనీశ్ లోక్‌నాథ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎ.కుమార్.

## విడుదలకు సిద్ధమైన రాజావారు



జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్, సంపద హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో చింతపల్లి రామారావు ఈ సినిమాను నిర్మించారు. ఆయన మాట్లాడుతూ 'అన్ని కమర్షియల్ అంశాలు కలిగిన సినిమా ఇది. దర్శకుడు సతీశ్ చిత్రాన్ని చక్కగా తీర్చిదిద్దారు. ప్రతి ఒక్కరినీ ఎంటర్‌టైన్ చేసే సినిమా ఇది. చిత్రం బాగుందని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు. రావు రమేశ్, నరేశ్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి తదితరులు నటించిన ఈ చిత్రానికి పాటలు: ప్రియమణి, సంగీతం: కైలాష్ మీనన్, ఫొటోగ్రఫీ: దాము నర్రావుల, సమర్పణ: రంగాపురం రాఘవేంద్ర.

## అద్భుతమైన కల 'కల్కి'



అందరూ ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏ.డీ'. ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీదత్ నిర్మించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి, దీపికా పదుకొనే, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమాను ఐదు భారతీయ భాషలతో పాటు ప్రపంచవ్యాప్తంగా మరిన్ని భాషల్లో విడుదల చేయనున్నారు. సోమవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అత్యద్భుత సాంకేతిక విలువలతో విజువల్ వండర్‌లా ఉన్న ఈ ట్రైలర్‌లోని వీఎఫ్‌ఎక్స్ షాట్స్, డైలాగ్స్, నటీనటుల పర్ఫామెన్స్, నేపథ్య సంగీతం మరో స్థాయిలో ఉన్నాయి. ట్రైలర్ విడుదల చేసిన అనంతరం దర్శకుడు నాగ్‌అశ్విన్ మాట్లాడుతూ "ఒక దర్శకుడిగా నాకు ఇండియన్ మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ అంటే చాలా ఇష్టం. ఈ సినిమాలో ఆ రెండింటినీ మిక్స్ చేశాను. ఈ ప్రయోగం థియేటర్లలో సినిమాను చూసే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ఈ సినిమా ఒక అద్భుతమైన కలలాంటిది. ఆ కలను తెరపైకి తెచ్చేందుకు చాలా సమయం పట్టింది. ఈ ప్రయాణంలో చిత్ర బృందం పడిన శ్రమ అంతా ఇంతా కాదు. టీమ్ అంతా ప్రాణం పెట్టి పనిచేయడంతోనే ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్న దానికంటే పది రెట్లు బాగా వచ్చింది" అని అన్నారు.



## ఇది నా అదృష్టం

'సీతయ్య', 'లాహిరి లాహిరి లాహిరిలో', 'దేవదాసు' వంటి బ్లాక్‌బస్టర్స్‌కు దర్శకత్వం వహించిన డైరెక్టర్ వై.వీ.ఎస్. చౌదరి. దాదాపు 9 ఏళ్ల గ్యాప్ తర్వాత ఆయన ఓ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వై.వీ.ఎస్.చౌదరి సతీమణి యలమంచలి గీత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సోమవారం నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను ఆయన ప్రకటించారు. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ చిత్రంతో నందమూరి జానకిరామ్ తనయుడు నందమూరి తారకరామారావు కథానాయకుడిగా పరిచయమౌతున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వై.వీ.ఎస్.చౌదరి మాట్లాడుతూ "మంచి కథతో మీ ముందుకు వస్తున్నాను. నందమూరి వంశం నుంచి నాలుగో తరానికి చెందిన నటుడ్ని పరిచయం చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. నిజానికి ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. నా ప్రతీ సినిమాలాగే ఇందులోనూ సంగీతానికి, సాహిత్యానికి పెద్దపీట ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాలోని హీరోని, హీరోయిన్‌ను, మిగతా చిత్ర బృందాన్ని పరిచయం చేస్తాను" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేశ్ అత్తిలి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Q2Rov6p లో చదవండి.

# అంబటి ఫొటోకు చీర సారె



అంబటి ఫొటోకు చీర, సారె ఇస్తున్న తెలుగు విద్యార్థి నేతలు

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి అంబటి రాంబాబు తన వయసుకు తగ్గట్టు హుందాగా మాట్లాడాలని తెలుగు విద్యార్థి జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ హెచ్చరించారు. గుంటూరులోని అంబటి ఇంటికి వెళ్లి ఆయనకు చీరె, జాకెట్టు, గాజులు, మల్లెపూలు ఇచ్చి చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని ఆహ్వానించేందుకు తెలుగు విద్యార్థులు ప్రయత్నించారు. ఆయన బయటికి రాకపోవడంతో ఆయన ఇంటి వద్ద కుర్చీలో అంబటి ఫొటో ఉంచి, ఆ ఫొటోకు చీరె, సారె అందజేసి తమ నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ పులిచింతల ప్రాజెక్టు పనుల అభివృద్ధి చేయాల్సింది పోయి ఐదేళ్లుగా ఎంజాయ్ చేయడమే అంబటికి సరిపోయిందని విమర్శించారు. ఇంకోసారి చంద్రబాబు, లోకేశ్ గురించి మాట్లాడితే తాము చేయాల్సిందేదో తామే చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయపాటి అమృతరావు, శంకర్, ధర్మతేజ, నరేంద్ర, ప్రశాంత్ గౌడ్, హరీశ్, సాయి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నూరు ఎంఈవో శోభచంద్ సస్పెన్షన్

గుంటూరు(విద్య), జూన్ 10: బాధ్యతాయుతమైన వృత్తిలో ఉంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన ఎంఈవోను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పొన్నూరు ఎంఈవోగా పనిచేస్తున్న రుద్రపాటి శోభచంద్ వైఎస్ జగన్ ఫాలోయర్స్ వాట్సాప్ గ్రూపులో సభ్యుడిగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలు ట్యాంపరింగ్ జరిగాయని చంద్రబాబు ఒప్పుకున్నట్లు ఓ తప్పుడు వీడియోను పోస్టు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్యేగా గెలిచిన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ఎంఈవోపై విచారణ చేసి సస్పెండ్ చేస్తూ సోమవారం ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు.

# మిర్చియార్డులో వాణిజ్యం పునఃప్రారంభం

- నెల రోజుల సెలవుల అనంతరం తెరుచుకొన్న గేట్లు
- తొలిరోజున కర్ణాటక నుంచి పలువురు రైతులు రాక
- అంతంత మాత్రంగానే లభించిన ధర

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)లో వాణిజ్యం పునఃప్రారంభమైంది. నెల పాటు వేసవి సెలవుల అనంతరం యార్డుకు రైతులు, కమీషన్ ఏజంట్లు, ఎగుమతిదారులు, హమాలీల రాకతో సోమవారం కళకళలాడింది. తొలి రోజున 22 వేలకు పైగా మిర్చి టిక్కీలను రైతులు యార్డుకు తీసుకొచ్చారు. ఇందులో ఏసీ, నాన్ ఏసీ వెరైటీలు రెండూ ఉన్నాయి. ఎక్కువగా కర్ణాటక ప్రాంతం నుంచి రైతులు వచ్చారని యార్డు అధికారవర్గాలు తెలిపాయి. ఎగుమతులకు ఇంకా డిమాండ్ లేకపోవడంతో ఎక్స్‌పోర్టర్లు మిరపకాయలను కొనుగోలు చేసే విషయంలో ఆచితూచిగా అడుగులు వేస్తున్నారు. ఈ కారణంగా రైతులకు అంతంత మాత్రంగానే ధర లభించింది.



రోహిణీకార్తె వెళ్లిపోయి వాతావరణం కాస్తంత చల్లబడటంతో ముందుగానే ప్రకటించిన విధంగా సోమవారం మిర్చియార్డులో లావాదేవీలను అనుమతించారు. తొలి రోజున 22,442 మిర్చి టిక్కీలను రైతులు విక్రయానికి తీసుకురాగా వాటిల్లో 14,739 అమ్మకం జరిగాయి. 7,703 టిక్కీలు యార్డులోనే నిల్వవుండిపోయాయి. నాన్‌ఏసీ వెరైటీలైన 334, నెంబరు. 5,273, 341లకు క్వింటాల్ రూ.7,500 నుంచి రూ.18వేల మధ్యన ధర లభించింది. ఏసీ వెరైటీలకు రూ.12వేల నుంచి రూ.19వేల వరకు ధర లభించింది. తాలుకాయలు రూ. 10 వేల లోపే ఉన్నాయి.

సంవత్సరానికి సరిపడా మిర్చి నిల్వలు శీతలగిడ్డంగుల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ధర ఇప్పట్లో పెరిగే అవకాశం లేదని యార్డువర్గాలు చెబుతున్నాయి. ఇక్కడే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లోనూ మిర్చి నిల్వలు పేరుకుపోయి ఉన్నట్లు సమాచారం అందింది. మరోవైపు విదేశాలకు ఎగుమతుల ఆర్డర్స్ ఇంకా రావడం లేదు. ఈ నేపథ్యంలో మిర్చి ధర భవితవ్యం ఎక్స్‌పోర్టర్ల పైనే ఆధారపడి ఉన్నది. మరికొన్ని రోజుల్లో ఎగుమతులు ప్రారంభమై ధర పెరుగుతుందన్న ఆశాభావంతో రైతులు ఉన్నారు.

# యరపతినేనిని కలిసిన జడ్పీ చైర్‌పర్సన్



పుష్పగుచ్ఛంతో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును అభినందిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

గుంటూరు సిటీ, జూన్ 10: ఉమ్మడి గుంటూరు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా దంపతులు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును సోమవారం కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన యరపతినేనికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో టీడీపీ సీనియర్ నేతగా ఉన్న యరపతినేనితో జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు కొద్ది నిముషాలు ప్రస్తుత జిల్లా పరిషత్ వ్యవహారాలపై చర్చించినట్లు తెలిసింది. కత్తెర హెని క్రిస్టీనాకు ఇబ్బంది ఏమి లేదు నేను అండగా ఉంటానని యరపతినేని హామీ ఇచ్చినట్లు సమాచారం. మొత్తంమీద జడ్పీ పీఠం కాపాడుకునేందుకు చైర్‌పర్సన్ దంపతులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

## జగన్ ముఠా మింగిన ప్రతి పైసా కక్కిస్తాం

- వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్10: గత ఐదేళ్ళుగా అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డు, అదుపు లేకుండా జగన్ ముఠా మింగిన ప్రతీ పైసాను కక్కించి తీరుతామని టీడీపీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి ప్యాలెస్, చుట్టుపక్కల ప్రాంతాల్లోనే వైసీపీ దొంగలు స్థావరాలను ఏర్పాటు చేసుకొన్నారని, పోలీసులు నిశితంగా నిఘాపెట్టి వారిని పారిపోకుండా చూడాలన్నారు. ఇసుక, మద్యం సహా వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి అవినీతి, అక్రమాలపై సరైన రీతిలో విచారణ జరిపించాలని చంద్రబాబుకు ఆయన విజ్ఞప్తి చేశారు. జ్యుడీషియల్ కమీషన్‌లు, ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి తప్పు చేసినవారిని బోనులో నిలబెట్టాలని కోరారు. మరీ ముఖ్యంగా సమాచార, పౌర సంబంధాల కమీషనర్‌గా పనిచేసిన విజయ్‌కుమార్‌రెడ్డిని అడ్డం పెట్టుకొని జగన్‌రెడ్డి తన సొంత పత్రికకు వందల కోట్లు ప్రకటనలు, డిజిటల్ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ద్వారా ఐ-ప్యాక్, అనుకూల మీడియా సంస్థలు, అనుకూల వ్యక్తులకు మళ్లించిన వందల కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జీవీ కోరారు.

# నాటక రంగ అభివృద్ధికి సహకారం

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



క్షేత్రం సాంఘిక నాటికలోని సన్నివేశం

పొన్నూరుటౌన్, జూన్10: ప్రాచీన కళలైన నాటక రంగ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్ని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. డాక్టర్ టీటీకేవీ ప్రసాదరావు కళా ప్రాంగణంలో సోమవారం 23వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ముగిశాయి. చివరి రోజు ఆయేష ఫిరదౌసి ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. సాత్విక, సూర్య ప్రకాశ్ అనే చిన్నారులు ఆదిత్య హృదయం శ్లోకాలాపన ఆకట్టుకుంది. గుంటూరుకు చెందిన కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ ఆధ్వర్యంలో బొమ్మిడి రామ కృష్ణ రచన దర్శకత్వంలో నాలోన నువ్వే నాటికను ప్రదర్శించారు. అనంతరం అరాధన ఆర్ట్స్ అకాడమి గుంటూరు ఆధ్వర్యంలో క్షేత్రం నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పొన్నూరు కళాపరిషత్ ఏటా నాటిక పోటీలు నిర్వహించటం అభినందనీయం అన్నారు. అంతరించి పోతున్న నాటక రంగాని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆకుల సాంబశివరావు, నూరినేని ఆంజనేయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సంకల్పంతోనే అమరావతికి మంచి రోజులు

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 10: చంద్రబాబు సంకల్ప బలంతోనే అమరావతికి మంచి రోజులు తిరిగి వచ్చాయని, ఆంధ్ర ప్రజలు అందరి కలల రాజధాని నిర్మాణం అతి త్వరలోనే పూర్తవుతుందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అమరావతి పూర్వవైభవం దిశగా ప్రస్తుతం మొదలైన పనులు రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో పట్టాలెక్కనున్నాయని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. సోమవారం తన నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవ నగరాలతో నాడు రైతులకు చంద్రబాబు సీఆర్‌డీఏ తరఫున ఏం వాగ్దానం చేశారో అంతకుమించిన స్థాయిలో అమరావతి సర్వాంగ సుందరంగా సిద్ధం చేస్తామన్నారు. కూటమి ఘన విజయం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార ఏర్పాట్ల నేపథ్యంలో రాజధాని అమరావతి ప్రాంతంలో పనుల్లో కదలిక సందర్భంగా తుళ్ళూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లో 20 గ్రామాల పరిధిలో 217.23 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఎక్కడ ఏం నిర్మించాలనేది సీఆర్‌డీఏ ప్రణాళికలో స్పష్టంగా ఉందన్నారు. వాటన్నింటి స్ఫూర్తితో దేశంలో అతి పెద్ద మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీగా సీఆర్‌డీఏ సరికొత్త చరిత్రను లిఖించబోతుందన్నారు. అమరావతి శంకుస్థాపన సందర్భంగా చంద్రబాబు తీసుకున్న సంకల్పబలంతోనే నేడు అమరావతి మళ్ళీ సగర్వంగా నిలబడబోతుందన్నారు.

## లాం ఫాంలో మిరప విత్తనాలు అమ్మకానికి సిద్ధం

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పరిశోధనా స్థానం లాం ఫారంలో ఈ నెల 13వ తేదీ(గురువారం) నుంచి ఎల్.సి.ఎ-625, ఎల్.సి.ఎ-643 మిరపరకాల ఫౌండేషన్ విత్తనం అమ్మనున్నట్లు పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.గిరిధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ఎల్.సి.ఎ-643 రకం కాయలు బాగా పొడవుగా, లావుగా, అధిక ఘాటు, రంగు కలిగి ఎండిన కాయలు బ్యాడిగ రకం వలె ముడతలతో ఉంటాయన్నారు. ఈ రకం పచ్చిమిరప, ఎండు మిరపకు అనువైన రకమని చెప్పారు. ఎల్. సి ఎ-625 రకం కాయలు మధ్యస్థ పొడవుతో సన్నగా ఉండి, అధికమైన ఘాటుతో మంచి రంగును కలిగి ఉంటాయి. కోత ఆలస్యమైనప్పటికి కాయ రంగును కోల్పోదు. కాయ నిల్వలో కూడా 2-3 నెలలు రంగును కోల్పోకుండా ఉంటుంది. బెట్టను తట్టుకోగల రకం. ఎద పెట్టి నాటుకోవటానికి మిక్కిలి అనుకూలమైన వెరైటీ. విత్తనాలు కొనదలచిన రైతులు నేరుగా ఉద్యాన పరిశోధనా స్థానం లాం ఫాంలో రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు విత్తనము లభ్యత వున్నంత వరకు పొందవచ్చును. కిలో విత్తనాల ధర రూ.1,200 మాత్రమేనన్నారు. పైన తెలియజేసిన మిరప విత్తనాలు కేవలం ఉద్యాన పరిశోధనా స్థానం, లాం ఫారం నందు మాత్రమే పొందగలరని, అవే పేర్లతో బయట ఎవరైనా ఈ విత్తనాలు అమ్మజూపినట్లతే రైతులు వాటిని కొని చేసి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. రైతులు ఫోన్ నెంబర్లు 99898 09554 / 73826 33661లను సంప్రదించ వచ్చని సూచించారు.

# కాసేపట్లో నిశ్చితార్థం.. అంతలోనే రోడ్డు ప్రమాదం

- పెళ్లికుమారుడి సహా మరో ఐదుగురికి తీవ్రగాయాలు



ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పద్మావతి

దాచేపల్లి, జూన్10: కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి నిశ్చయ తాంబూలాలకు వెళ్తుండగా ముందుగా పోతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనే వున్న చెట్టును ఢీకొని పెళ్లికుమారుడితో సహా కుటుంబసభ్యులు తీవ్ర గాయాలపాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా వున్నాయి... దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో విద్యుత్ శాఖలో ఎల్ఐగా పనిచేస్తున్న కంద్రాతి హనుమంతరావు కుమారుడు శశికుమార్‌కు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం పాల్వంచలో నిశ్చితార్థం కోసం కారులో ఆదివారం బయలుదేరారు. సీతానగరం సమీపంలో ముందుగా వెళ్తన్న ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి బండికి ఆయిల్ క్యాన్ అమర్చుకొని కారుకు ముందుగా వెళ్తన్నాడు. బండికి ఆయిల్‌క్యాన్ వుండటంతో ద్విచక్రవాహనానికి కారు తగులుతుందేమోనన్న అనుమానంతో కారును రోడ్డు మార్జిన్‌కు సైడు తీశాడు. కారు వేగంగా వెళ్తండటంతో అదుపుతప్పి అదే వేగంతో రోడ్డు పక్కనే వున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. కారులో ముందు కూర్చున్న పెళ్లికుమారుడు కంద్రాతి శశి కుమార్, తల్లి పద్మావతి, పిన్ని రాజ్యలక్ష్మీ, వదిన ఓరుగంటి అంజలి, బావమరిది ఓరుగంటి శంకర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరుగటంతో స్థానికులు కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి 108 వాహనంలో సమీపంలో వున్న బోనకల్లు, వైరా, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. పెళ్లికుమారుడు శశికుమార్ కాలుకు తీవ్రగాయమైంది.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తరలించిన యాజమాన్యం



గణేష్ (ఫైల్‌ఫొటో)

దుర్గి, జూన్ 10: షార్ట్‌సర్క్యూట్‌తో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కాకిరాల శివారులో వినీత్ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మసీ కంపెనీలో చోటుచేసుకుంది. నక్కా గణేష్ (27) వినీత్ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కొంతకాలంగా ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం కంపెనీకి నీరు కోసం బోరు మోటారు స్విచ్ ఆన్ చేయడానికి దగ్గర్లోని పొలం వద్దకు వెళ్లాడు. స్విచ్ వేయగానే బోర్డు నుంచి షార్ట్ సర్క్యూట్ అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న యాజమాన్యం మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కోటయ్య సంఘటనా స్థలానికి చేరుకొని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో పలు అనుమానాలను దారితీస్తోంది. మృతుడు గణేష్ వెల్దుర్తి మండలం పట్లవీడుకు చెందినవాడు. మృతునికి భార్య శ్రావణి ఉన్నారు. ఆరు రోజుల క్రితమే పాప జన్మించింది.

## వైసీపీ బాధిత కుటుంబానికి ప్రమాణస్వీకార ఆహ్వానం



చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ఆహ్వానం అందిన ఉప్పాల అమర్‌నాథ్‌గౌడ్ తల్లి, సోదరి

రేపల్లె, జూన్ 10: అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించిన తమ్ముడు ఉప్పాల అమర్‌నాథ్‌గౌడ్‌ను వైసీపీ మూకలు దారుణంగా పెట్రోల్ పోసి చంపివెయ్యటంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 12వతేది ప్రమాణస్వీకారానికి వైసీపీ బాధితులైన చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెంకు చెందిన సోదరి ఉప్పాల హేమశ్రీ, తల్లి మాధవికి ప్రత్యేక ఆహ్వానం పంపించారు. దీంతో సోదరి హేమశ్రీ మాట్లాడుతూ కష్టకాలంలో మాకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అప్పటి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అండగా నిలిచి భరోసాను కల్పించారని నా ఉన్నత చదువుల నిమిత్తం ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అవకాశం కల్పించారని కన్నీటి పర్యంతమయ్యింది. ఈ రోజు మా కుటుంబాన్ని గుర్తుపెట్టుకుని ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించటం గర్వంగా ఆనందంగా ఉందన్నారు.

## మృతురాలి ఆచూకీ లభ్యం

పెదకాకాని, జూన్ 10: అనుమానస్పద స్థితిలో మృతి చెందిన యువతి ఆచూకీని పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన షేక్ అమీరున్(20)ను సత్తెనపల్లి టౌన్‌కి చెందిన షేక్ రఫీకి ఇచ్చి ఏడాది క్రితం వివాహం జరిపించారు. గత నెల 24 తేదీన రావెల గ్రామం నుంచి భార్య భర్తలు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గుంటూరు ఆసుపత్రిలో చూపించుకునేందుకు వెళ్లారు. అయితే 25వ తారీకు ఉదయం పెదకాకాని వీఆర్వో సంస్థ వెనుక పొలాల్లో అమీరున్ మృతి చెంది పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అనుమానస్పద కేసు నమోదు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇంటి నుంచి వెళ్లిన భార్యాభర్తలు తిరిగి రాకపోవడంతో బంధువులు తాడికొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా గత నెల 30న మిస్సింగ్ కేసు నమోదు చేశారు. భర్త అదృశ్యం కాగా, భార్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. భర్త ఆచూకీ లభిస్తే కానీ ఈ కేసులో మిస్టరీ తేలుతుంది.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులకు శిక్షణ



ప్రసంగిస్తున్న సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు, పక్కన చైర్మన్ విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, జూన్ 10: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నోడల్ కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకులకు వారంపాటు శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులకు ఆటోమేషన్, పి.ఎల్.సి ప్రోగ్రామింగ్, ట్యాగ్స్, టైమర్స్, ఆర్గనైజేషన్ బ్లాక్స్, డేటా బ్లాక్స్, అధునాతన సాంకేతిక అంశాలలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో శిక్షణను అందించనున్నారని తెలిపారు. ఈనెల 15 వరకూ నిర్వహిచనున్న ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్స్ కళాశాలలకు చెందిన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన అధ్యాపకులు పాల్గొంటారని చెప్పారు. వీవీఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపయోగకరమైన ఇటువంటి కార్యక్రమం వివిఐటిలో జరగటం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి, ఎస్.బి. టి.ఈ.టి కార్యదర్శి కె.వి.రమణబాబు, ఎన్.ఐ.టీ. టీ.టీ.ఆర్, చెన్నై ప్రొఫెసర్ జీ.ఎ.రాతి, ఆంధ్ర ప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్స్ కె.విజయభాస్కర్, ఎం.ఎ. వి. రామకృష్ణ, బి.కల్యాణ్, ఓ.ఎస్.డి బి.నాగేశ్వర రావు, ఏ.బి.వి సుబ్బారెడ్డి, ఎస్.బి.ఈ.టీ సహకార్యదర్శులు జానకిరామయ్య, జి.వి.వి. సత్య న్నారాయణ మూర్తి పాల్గొన్నారు.

## చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

యడ్లపాడు, జూన్ 10: యడ్లపాడు మండలం మైదవోలు మైనర్ ఇరిగేషన్ చెరువులో అక్రమంగా చేస్తున్న మట్టి తవ్వకాలను పోలీసులు సోమవారం అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్నారంటూ స్తానికులు అందించిన సమాచారంతో పోలీసులు తవ్వకాలు నిర్వహిస్తున్న చెరువు వద్దకు చేరుకుని తవ్వకాలను నిలిపి వేశారు. అక్కడ ఉన్న జేసీబీని, రెండు ట్రాక్టర్‌లను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఈ తవ్వకాలను చేస్తున్నట్లు సమాచారం.

## వైసీపీ కౌన్సిలర్ల రహస్య భేటీ

సత్తెనపల్లి, జూన్ 10: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావటం, సత్తెనపల్లి శాసన సభ్యునిగా కన్నా విజయం సాధించటంతో పట్టణంలోని వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ వైపు దృష్టి సారించారు. ఆదివారం 16 మంది వైసీపీ కౌన్సిలర్లు రహస్యంగా సమావేశం అయ్యారు. చైర్‌పర్సన్ లేకుండా, 24వ వార్డు వైసీపీ కౌన్సిలర్ లేకుండా పట్టణంలోని 16 మంది వైసీపీ కౌన్సిలర్లు సమావేశం అవ్వటం పట్టణంలో చర్చనీయాంశంగా ఉంది. ఎమ్మెల్యే కన్నాను కలసి టీడీపీలో చేరటానికి రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తుంది. కౌన్సిలర్ల సమావేశం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# గంజాయి విక్రేతల అరెస్టు

- 2 కేజీల గంజాయి స్వాధీనం
- 8 మంది నిందితుల అరెస్టు

తెనాలి, మారీసుపేట, జూన్ 10: పట్టణంలో గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తును అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎం.రమేష్ తెలిపారు. సోమవారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న గంజాయిని, నిందితుల వివరాలను తెలిపారు. ఆదివారం సాయత్రం స్ధానిక బాలాజీరావుపేటలోని తాడిబోయిన మస్తానమ్మకు చెందిన ముళ్ళ కంపలతో కూడిన ఖాళీ స్థలం వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేర సీఐ ఎస్ రమేష్‌బాబు తన సిబ్బందితో దాడి చేసి మహమ్మద్ సర్దార్, షేక్ అబ్దుల్ రెహమాన్, రాపోలు నరసింహరావు, జమ్మలమూడి గోపి, దిడ్ల ప్రభుదేవా, ఆకురాతి భరత్, సయ్యద్ మహమ్మద్ సోహెల్ , కొమ్మతోటి పాల్‌రాజులను అదుపులోకి తీసుకొని, విచారించామన్నారు. వారు ముఠాగా ఏర్పడి ఒరిస్సా రాష్ట్రం నుమచి 2 కేజీల గంజాయిని రూ.40 వేలకు కొనుగోలు చేసి వాటిని తెనాలిలో చిన్న, చిన్న ప్యాకెట్‌లుగా విక్రయిస్తున్నారని తెలిపారు. వీరివద్ద నుండి 2 కేజీ గంజాయిని, స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. గత రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌తో భేటీ అయన పోలీసు అధికారలుతో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, శాంతి భద్రతలపై దృష్టి పెట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ ఆదేశాల మేరకు నిషేదిత గంజాయి విక్రేతలపై దృష్టిపెట్టామని డీఎస్పీ రమేష్ తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎఎస్సై దేవాప్రసాద్, పీసీలు పి మురళి, వి శ్రీహరి, డి సురేష్, సిచ్ శ్రీరామమూర్తిలను అభినందించారు.



గంజాయి ప్యాకెట్స్‌ను, నిందితుల వివరాలను తెలుపుతున్న డీఎస్పీ రమేష్, సీఐ రమేష్‌బాబు, ఎస్సై వెంకటేశ్వరావు తదితరులు

### 14,739 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 22,442 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 14,739 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,703 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 8000 | 15200 |
| నెంబరు. 5 | 7500 | 15000 |
| 273 | 11000 | 15000 |
| 341 | 8000 | అ18000 |
| 4884 | -- | -- |
| సూపర్ 10 | -- | -- |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 8000 | 19500 |
| బ్యాడిగి | 8000 | 18500 |
| దేవనూరుడీలక్స్ | 8000 | 12000 |

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| తెల్లకాయలు | 5000 | 10000 |
| ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 12500 | 12600 |
| నెంబరు. 5 | 15000 | 15000 |
| 4884 | 13000 | 13000 |
| సూపర్ 10 | -- | -- |
| ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 14000 | 19500 |
| బ్యాడిగి | 13000 | 15000 |
| దేవనూరుడీలక్స్ | 13000 | 13000 |
| తెల్లకాయలు | 6500 | 10000 |

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 147, 156,167 |
| చికెన్ విత్ స్కిన్ | 284.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 294.00 |

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



## అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు

● మైనింగ్‌శాఖ ఏడీ రాజేష్‌కుమార్



మండలంలోని ఓలేరు రీచ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్ శాఖ అధికారులు

భట్టిప్రోలు, జూన్ 10: అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్‌శాఖ ఏడీ రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఓలేరు వద్ద ఇసుక రీచ్‌ను వారాంతపు తనిఖీల్లో భాగంగా సోమవారం ఓలేరును రీచ్‌ను అధికారులు పరిశీలించారు. ఓలేరు రీచ్ వద్ద పరిస్థితిని పరిశీలించి సమీప పంట పొలాల రైతులను ఇసుక తరలింపు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలించడం నేరమని తరలించే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రీచ్‌ల వద్ద పోలీస్ అధికారులతో కలిసి పర్యవేక్షించాలని రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమం లో తహసీల్దార్ ఐ మునిలక్ష్మి, సెబ్, పోలీస్, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక రీచ్‌లు పరిశీలించిన జాయింట్ కలెక్టర్



పాలిమేర డొంక వద్ద గండికొట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్

కొల్లూరు, జూన్ 10: ఇసుక రీచ్‌లను జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ పరిశీలన చేశారు. సోమవారం మండలపరిధిలోని ఈపూరు, పెదలంక మధ్య ఉన్న కృష్ణానదిలో ఇసుక రీచ్‌ను పరిశీలించి ఇక్కడ అక్రమ ఇసుక రవాణా జరగకుండా ఏర్పాటు చేసిన కందకాలను జేసీ పరిశీలించారు. కొల్లూరు మండలపరిధిలోని పెదలంక, పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం వద్ద ఉన్న కృష్ణానది నుంచి ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులతో నిఘా ఏర్పాటు చేసినట్లు మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు జేసీకి వివరించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జేసీ ప్రభుత్వ శాఖల అధికారులకు సూచించారు. అనంతరం గాజుల్లంక, జువ్వలపాలెం ఇసుక రీచ్‌లను కూడా జేసీ పరిశీలన చేశారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్, రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, డీఎల్‌పీవో శివశంకర్, తహసీల్దార్ పుల్లా రావు, ఆర్‌సీ ఏఈ సురేష్, ఈవోపీఆర్డీ రవిబాబు, ఆర్ఐ త్రివేణి, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రతిజ్ఞ' రచయిత తెలుగువారవడం గర్వకారణం

● సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ



పైడిమర్రి వెంకట సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న రావూరి నరసింహవర్మ తదితరులు

బాపట్ల, జూన్ 10 : భారతదేశం నా మాతృభూమి భారతీయులు అందరు నా సహోదరు లు అనే ప్రతిజ్ఞను రచించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు తెలుగువారవడం తెలుగుజాతికి ఎంతో గర్వకారణమని సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. సోమవారం పైడిమర్రి వెంకట సుబ్బారావు 108వ జయంతి సభలో ఉపాధ్యాయులు షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, సాహితీ భారతి కోశాధికారి ఆదంషఫీ, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, శ్రీనివాస్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రతిజ్ఞ ద్వారా ప్రతి పౌరుడిలో విద్యార్థిదశ నుంచి దేశభక్తి, సౌభ్రాతృత్వం, పెద్దలపై ఆదరాభిమనాలు అలవడుతాయని, ప్రతిజ్ఞ దేశభాషలన్నిటిలోనూ అను వందింపబడిందని, సాహితీవేత్త తెన్నేటి విశ్వనాధంల కృషితో ప్రతిజ్ఞకు జాతీయ స్థాయి గుర్తింపు వచ్చిందన్నారు. అనంతరం కస్తూరి శ్రీనివాస రావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి రచయితలు తదితరులు పైడిమర్రి వెంకట సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

## వైసీపీ, టీడీపీ వర్గీయుల పరస్పర దాడులు

కర్లపాలెం, జూన్ 10 : పిండ ప్రదానాలు జరిపే స్థలంలో మాజీ ఎమ్మెల్యే అండ చూసుకొని వైసీపీ సర్పంచ్ యల్లావుల సురేష్ రాఘవ్ (నానీ) కృష్ణుడి గుడి కట్టాడని గ్రామస్థులు, టీడీపీ వర్గీయులు సర్పంచ్ నానీని తీవ్రంగా విమర్శిస్తున్నారు. పిండప్రదానాలు చేసుకునే విషయంలో వైసీపీ, టీడీపీ వర్గీయులకు మండలంలోని పెదగొల్లపాలెంలో ఆదివారం గొడవ ప్రారంభమైంది. టీడీపీ వర్గీయులు అటు వెళుతున్న సమయంలో అందులో ఒకరిని వైసీపీ వారు కొట్టడంతో టీడీపీ వర్గీయులు గొడవకు దిగారు. సమాచారం తెలుసు కున్న కర్లపాలెం ఇన్‌చార్జి ఎస్‌ఐ అనీల్‌కుమార్ సిబ్బందితో వచ్చి గొడవను సర్దుమనిగేలా చేశారు.

## వరకట్న వేధింపులపై కేసు నమోదు

బాపట్ల, జూన్ 10 : వరకట్న వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తమామలపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ య.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రైలుపేటకు చెందిన అనుషారెడ్డికి నరసాయపాలెం గ్రామానికి చెందిన కళ్లం నాగమహేశ్వరరెడ్డితో వివాహం చేశారు. భర్త మహేశ్వరరెడ్డితోపాటు అత్తమామలు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేసిన ఎస్‌ఐ

పిట్టలవానిపాలెం, జూన్ 10 : పిట్టవానిపాలెం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి ఇటీవల బైక్‌పై వెళుతుండగా తన మొబైల్‌ఫోన్ జారిపడి పోయిందని చందోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చందోలు ఎస్‌ఐ టి.అనీల్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. మొబైల్ ఫోన్ ట్రేస్ చేసి సోమవారం పోలీసుస్టేషన్‌కు పిలిపించి బాధితుడు వెంకటరెడ్డికి ఎస్‌ఐ అనీల్‌కుమార్ సెల్‌పోన్‌ను అందజేశారు.

## అంకితభావంతో పార్టీకి సేవలందించిన లాజర్



లాజర్ స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకలు రమాదేవి తదితరులు

భట్టిప్రోలు, జూన్ 10: అంకితభావంతో పేదవర్గాలకు అండగా నిలుస్తూ పార్టీకి సేవలందించిన మహోన్నత వ్యక్తి లాజర్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. మండలంలోని పెదపులివర్రు పంచాయతీ అక్కివారిపాలెం గ్రామంలో సోమవారం లాజర్ ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. తొలుత లాజర్ స్మారక స్థూపం వద్ద రమాదేవి పూలమాల వేసి, జెండాను ఆవిష్కరించి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గోళ్ళ నాగరాజు అధ్యక్షత వహించారు. సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ లాజర్ జీవితాంతం పార్టీ ఆశయాల కోసం పేదల కోసం పని చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, సీహెచ్ మణిలాల్, మండల కార్యదర్శి జి.సుధాకర్, గుంటూరు, బాపట్ల జిల్లా కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వసతుల్లేని కాలనీలు.. అల్లాడుతున్న లబ్ధిదారులు

● గ్రామాల్లో బీడు భూములుగా జగనన్నకాలనీలు

● వర్షం వస్తే చిత్తడి.. రాకపోకలకు ఇబ్బందులు

బాపట్ల, జూన్ 10 : జగనన్నకాలనీలలో లబ్ధిదారులు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. కాలనీలు కాదు ఏకంగా ఊళ్ళనే నిర్మిస్తున్నామని ఊకదంపుడు ఉపన్యాసాలు చేసిన వైసీపీ నాయకులు కాలనీవాసుల కష్టాలు తీర్చటంలో మాత్రం నిర్లక్ష్యవైఖరి అనుసరించారు. ఇళ్ళు నిర్మించకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామని బెదిరించటంతో పేద కుటుంబాలకు చెందినవారు అప్పులు చేసి గృహ నిర్మాణాలు ప్రారంభించారు. చేసిన అప్పులకు నిర్మాణాలు పూర్తికాగా మధ్యలోనే అనేక మంది వదిలేశారు. కొంత మంది గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నప్పటికీ కాలనీలో కావాల్సిన వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. బాపట్ల పట్టణంలో ప్యాడిసన్‌పేట, బేతనీకాలనీ, మూలపాలెం రోడ్డులో మొత్తం మూడు జగనన్న లేఅవుట్‌లు ఏర్పాటు చేసి 3,400 మందికి సెంటున్నర చొప్పున స్థలాలిచ్చారు. లబ్ధిదారులకు గృహనిర్మాణ సంస్థ ద్వారా పక్కా గృహాలు మంజూరు చేశారు. అందులో ఇప్పటి వరకు 1800 గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. 600 గృహాలు బేస్‌మెంట్ వేసి వదిలేశారు. 500 గృహాలు వివిధ స్థాయి నిర్మాణాల్లో ఉన్నాయి. మరో 500 ఖాళీ స్థలాలుగా ఉన్నాయి. కాలనీలలో రోడ్డులు లేవు, తాగునీటి వసతి కల్పించలేదు. కేవలం విద్యుత్ సౌకర్యంతో సరిపెట్టారు. దీనివల్ల కాలనీవాసులు తాగునీటిని కొనుగోలు చేసుకొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. పురపాలక సంఘం నుండి ట్యాంకర్లతో నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. దీనికితోడు అధ్వానంగా ఉన్న రోడ్లపై వర్షం పడితే చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతున్నది. కాలనీవాసులకు అనారోగ్యం వస్తే వైద్యం కోసం కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి ఉంది. ఈ విధంగా పట్టణంలోని జగనన్నకాలనీవాసులు అనేక సమస్యలతో అల్లాడిపోతున్నారు. కొంతమంది గృహాలు నిర్మించుకోవటానికి తెచ్చుకున్న అప్పులు తీర్చలేక వడ్డీ పెరిగిపోయి విక్రయించే పరిస్థితి ఏర్పడింది. అనేక గృహాలు విక్రయించారు. ఖాళీ స్థలాలు కూడా చేతులు మారాయి. వైసీపీ ప్రభుత్వంలో పాలకుల సహకారం కొరవటం వల్లే పేదలు స్థలం వచ్చిందన్న ఆనందం లేకుండానే అప్పులు పాలై అల్లాడిపోతున్నారు.



బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్ పేట జగనన్నకాలనీ లేఅవుట్‌లో అసంపూర్తిగా నిర్మించిన గృహాలు



కర్లపాలెంలో గృహాలు నిర్మించకుండా ఉన్న ఖాళీ స్థలాలు

### మండలాల్లో మంజూరుకాని గృహాలు..

నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలా ల్లో ఉన్న 59గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 4వేల మందికి నివేశన స్థలాలు ఇచ్చారు. ఆయా జగనన్నకాలనీలకు సంబంధించిన వారికి గృహనిర్మాణ సంస్థ ద్వారా పక్కా గృహాలు మంజూరు కాలేదు. దీనివల్ల జగనన్నకాలనీ లేఅవుట్‌లు బీడు భూములుగా మారిపోయాయి. కొంతమంది పూరిపాకలు, రేకులషెడ్‌లు నిర్మించుకొని ఉంటున్నారు. ఎక్కువ మొత్తం ప్లాట్‌లలో ముళ్ళచెట్లు పెరిగిపోయి కాలనీ రూపురేఖలు కూడా కనిపించని విధంగా మారిపోయాయి. హౌసింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపిన మండలాల్లో పక్కాగృహాలు మంజూరు కాలేదు. దీనివల్ల స్థలాలు వచ్చాయన్న ఆనందమే తప్ప సొంతింటి కల నెరవేరక పేదలు అద్దె గృహాల్లోనే జీవనం సాగిస్తున్నారు.

### జగనన్నకాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

● కమిషనర్ బి.శ్రీకాంత్



పట్టణంలోని మూడు జగనన్నకాలనీలలో మౌలికసదుపాయాలు కల్పిస్తాం కాలనీలలో నివసిస్తున్న ప్రజలకు తాగునీరు, విద్యుత్, ఇతర సదుపాయాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల దృష్ట్యా కాలనీలలో పర్యటనకు ఎక్కువగా వెళ్ళలేదు. ఇకపై తరుచుగా కాలనీలను సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరిస్తాం. ప్రజలు ఎటువంటి ఆందోళన పడాల్సిన అవసరంలేదు.

## ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు

బాపట్ల, జూన్ 10: ప్రముఖ సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. యువనాయకుడు కుర్రా ధనేంద్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నటుడిగా, రాజకీయనాయకుడిగా బాలకృష్ణ విశేషంగా రాణిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు ఎం సాంబశివరావు, బాలకృష్ణ యూత్ సభ్యులు, జనసేన, బీజేపీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని అప్పికట్ల గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని జన్మదిన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాధ్, ప్రభాకర రావు, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, సీతారామయ్య, శ్రీను, సురేష్, ప్రమోద్, శివన్నారాయణ, టీడీపీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వేమూరు మండలంలో..

వేమూరు, జూన్ 10: బాలకృష్ణ జన్మదిన వేడుకలు మండల పరిధి గ్రామాల్లో అభిమానులు ఘనంగా నిర్వహించారు. వేమూరు సినిమా హాల్ సమీపంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు, టీడీపీ నాయకులు మన్నే పసి, వెంకటేశ్వరరావు (పండు), కూచిహుడి రవి, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, తుమ్మల బుజ్జి, ఉమామహేశ్వరరావు, గోపినాధ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల దగ్గర నందమూరి బాలకృష్ణ జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

### రేపల్లె మండలంలో..

రేపల్లె, జూన్ 10: సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 5వవార్డులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలను పంచి పెట్టారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు గోగినేని పట్టాభిరామారావు మాట్లాడుతూ రాజకీయ రంగంలో హిందూపురం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించి ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకులు మద్దుల అంకాలు, గోగినేని శ్రీనివాసరావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రగాంధీగా దుగ్గిరాల చిరస్మరణీయులు

● తహసీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్



దుగ్గిరాల గోపాలకృష్ణయ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న తహసీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్, పీసీ సాయిబాబు తదితరులు

బాపట్ల, జూన్ 10: స్వాతంత్రోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి ఆంధ్ర గాంధీగా ఖ్యాతినార్జించిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చిరస్మరణీయులని తహసీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్ తెలిపారు. దుగ్గిరాల వర్ధంతి కార్యక్రమాన్ని ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వ హించారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి తహసీల్దార్ సిబ్బందితో కలిపి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీదేవి, ఉపాధ్యాయుడు చిల్లా సత్యనారాయణ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 3వసారి మోదీ ప్రధాని కావడంపై బీజేపీ నేతల హర్షం


రేపల్లె, జూన్ 10: ప్రధాన మంత్రిగా మూడో సారి మోదీ ప్రమాణ స్వీకారం చేయడంతో పట్టణంలోని బీజేపీ నాయకులు మిఠాయిలు పంచిపెట్టి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం బీజేపీ సీనియర్ నాయకులు పినపాల సత్యసాయిబాబు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో 10 సంవత్సరాలుగా ప్రధానమంత్రి మోదీ ఎన్నో నూతన సంస్కరణలు తీసుకువచ్చి ప్రపంచ దేశాలు గర్వపడేలా పరిపాలన అందించారన్నారు. అటు దేశంలో ఇటు రాష్ట్రాల అభివృద్ధికి వేలాది కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి అభివృద్ధి చేసిన ఘనత మోదీదేనన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటం దేశవ్యాప్తంగా ప్రజలు హర్షిస్తున్నారన్నారు. ఎన్డీఏ కూటమి ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోను అన్ని విధాలా అభివృద్ధి జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**చెరుకుపల్లి, జూన్ 10:** 3వసారి దేశ ప్రధానిగా మోదీ ప్రమాణం చేయడం హరణీయమని బీజేపీ నేత రాంపల్లి జగన్నాథశాస్త్రి అన్నారు. ఉభయ రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రిగా ప్రమాణం చేసిన రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్‌లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుమ్మడి శ్రీనివాసరావు, వి.శివరావు, పి.కృష్ణ ప్రసాద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా వైద్యశాలలో పండ్లు, రొట్టెల పంపిణి

బాపట్ల, జూన్ 10: లోకసభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించిన సమాజ్‌వాదిపార్టీ అధినేత అఖిలేష్‌యాదవ్‌కు అభినందనలు తెలియజేస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు సోమవారం ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సామాజిక న్యాయం దిశగా పనిచేస్తున్న అఖిలేష్‌యాదవ్ నాయకత్వంలో ప్రజలను కలుపుకొని పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి శ్యామ్ లివింగ్‌స్టన్, కాండ్రు శరత్‌కుమార్, మోర్లచిన వెంకటేశ్వరరావు, తోట దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## చెట్ల నరికివేతపై రైతుల ఆగ్రహం



బాడవ డొంకలో నరికివేసిన చెట్లు

అమృతలూరు, జూన్ 10: అమృతలూరులో పరిధిలోని బాడవ డొంకలో చెట్లును ఇష్టానుసారంగా నరికివేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తపరిచారు. బాడవ మురుగు కాల్వ గట్టుపై ఉన్న చెట్లను ఒక రైతు తన పొలం ఎదుట మాత్రమే కాకుండా కాల్వ గట్టుపై ఉన్న తాటి, వివిధ రకాల చెట్లును నరికివేయించాడు. దీంతో సమీపంలోని రైతులు అభ్యంతరం తెలుపుతూ వీఆర్వో రోశయ్యకు ఫిర్యాదు చేశారు. బాడవ మురుగుకాల్వ అధిక వర్షాలు పడినప్పుడు ఉధృతి ఎక్కువగా ఉంటుందని ఇలా చెట్లు కొట్టి వేయడం వల్ల కాల్వ గట్టు కోతకు గురై పంట పొలాలు ముంపునకు గురై ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెట్లను నరికివేసిన రైతుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### చందోలులో ఉచిత మెడికల్ క్యాంప్

పిట్టలవానిపాలెం, జూన్ 10 : మండలంలోని చందోలు-1 గ్రామసచివాలయం నందు సోమవారం 104 ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందోలు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి ఎస్ చంద్రిక ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య సేవలందించి మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, సీహెచ్‌వో సుజాత, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

### దుర్గాభవానీ మాత ఆలయంలో హోమం

బాపట్ల, జూన్ 10: పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో ఉన్న ప్రసన్నా దుర్గాభవానీమాత ఆలయంలో సోమవారం హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భక్తజనం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పండితులు హోమం జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## దుర్గాప్రసాద్ కుటుంబానికి ఆర్థిక సాయం



దుర్గాప్రసాద్ కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, జూన్ 10: మండలంలోని పేటేరు గ్రామానికి చందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జంజనం దుర్గాప్రసాద్ మృతి చెందడంతో సోమవారం వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటి తరపున గోళి రామశేషగిరిరావు రూ.11వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి టీడీపీ ఎప్పుడు అండగా ఉంటుందని ఆయన అన్నారు. గ్రామ కమిటీలోని సమష్టి కృషితో ఆర్థిక సాయాన్ని అందించామన్నారు. రానున్న రోజుల్లో ఆ కుటుంబానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అండగా ఉంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో గోళి వెంకటేశ్వరరావు, సురేష్, తుళ్ళూరు శ్రీనివాసరావు, ఆరేపల్లి నాగరాజు, కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు, దివి ధనుంజయరావు, శొంఠి నరేంద్ర, ఎం. మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల అభిమానం మరువలేనిది : ఎమ్మెల్యే వేగేశన



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజల అభిమానం మరువలేనిదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని తాడిపాపయ్య బజారులో సోమవారం టీడీపీ నాయకులు సబ్బినేని కిషోర్, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో నరేంద్రవర్మను ఘనంగా సన్మానించారు. పేద విద్యార్థులకు అందించేందుకు తమవంతుగా నోట్‌పుస్తకాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉండి నిజాయితీగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం బాధ్యతగా భావించి సేవలందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ముక్కాముల సాంబశివరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నరేంద్రవర్మకు ముప్పలనేని శుభాకాంక్షలు



ఎమ్మెల్యే వేగేశనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముప్పలనేని

బాపట్ల, జూన్ 10 : బాపట్ల ఎమ్మెల్యే గా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన వేగేశన నరేంద్రవర్మను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు ఆయన తనయుడు సుమంత్‌తో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేగా బాపట్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా బాపట్ల మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, వీఆర్ క్రియేషన్స్ టీమ్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్, వెంకు, కిషోర్, కృష్ణ, వివిధ గ్రామాల నాయకులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంకమ్మతల్లి జాతరలో ఎమ్మెల్యే ఆనందబాబు



చావలిలో అంకమ్మ తల్లి దేవరను తలపై ఎత్తుకున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూన్ 10: మండలంలోని చావలి గ్రామంలో ఉన్న గ్రామ దేవత అంకమ్మ తల్లి జాతర కార్యక్రమంలో సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న జాతర కార్యక్రమంలో బాగంగా అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా హాజరైన ఆనందబాబు అమ్మవారిని తలపై ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారి పీఠం వద్ద పూజలు జరిపించి మొక్కుబడి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించాలన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షులు దండే వెంకట సుబ్బారావులు ఆనందబాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, టీడీపీ సీనియర్ నాయకులు మైనేని మురళీకృష్ణ, చావలి గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాస రావు, గోపాలం త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలతో టీడీపీ విజయోత్సవం



టీడీపీ విజయోత్సవంలో పాల్గొన్న తెలుగు మహిళలు

వేమూరు, జూన్ 10: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించడంతో పాటు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు అఖండ మెజార్టీతో గెలుపొందిన సందర్భాన్ని పురస్కరించుకుని వెయ్యి మంది తెలుగు మహిళలు వేమూరులో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి హాజరైన తెలుగు మహిళలు ఆట పాటలతో ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు విందు భోజనాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ నియోజకవర్గం తెలుగుమహిళా అధ్యక్షురాలు గంటా స్వాతి, ప్రవీణ, రమాదేవి, తలసిల కల్పన, గవిని లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## ఐలవరం శివాలయంలో టీడీపీ నాయకుల పూజలు



శివాలయంలో పూజలు జరిపిస్తున్న టీడీపీ నాయకులు

భట్టిప్రోలు, జూన్ 10: కూటమి అఖండ విజయం సాధించడంతో మండలంలోని ఐలవరం శివాలయంలో టీడీపీ నాయకులు సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేరున శివాలయంలో పరమశివుడికి అభిషేకాలు నిర్వహించారు. 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి చీర సారెలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కూరపాటి రఘురామయ్య, మాచర్ల రంగారావు, మాచర్ల నాగేశ్వరరావు, పంచుమర్తి శంకరరావు, జొన్నాదుల లీలాకృష్ణ, పంచుమర్తి చిన్ని, యల్లారయ్య, జనసేన యూత్ అవ్వారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఈ పోస్టు ద్వారా మోదీకి శుభాకాంక్షలు

భట్టిప్రోలు, జూన్ 10: ప్రధాన మంత్రి ఇతర కేబినేట్ మంత్రులకు ఈ పోస్టు ద్వారా శుభాకాంక్షలు తెలియజేసే అవకాశం పోస్టాఫీసు నందు కల్పించినట్లు భట్టిప్రోలు పోస్టుమాస్టర్ సీహెచ్ భాగ్యరాజు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్రమోదీతో పాటుగా మంత్రులకు పోస్టల్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేయవచ్చునన్నారు. కేవలం రూ.11.80 పైసలు మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ సద్వినియోగించుకోవాలని పోస్టుమాస్టర్ భాగ్యరాజు కోరారు. దీనిలో భాగంగా విశ్రాంత ఐఏఎస్ పడమట సుందర్‌కుమార్ కార్యాలయానికి విచ్చేసి తపాలా సేవలను గురించి తెలుసుకుని ప్రజలకు చేరువ చేస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారని భాగ్యరాజు చెప్పారు.

# ఇకనైనా పట్టించుకుంటారా..?

- శిథిలమైన ఉద్యోగుల వసతి భవనాలు
- విలువైన ప్రభుత్వ స్థలంలో పాడైన పోలీస్, ఎన్ఎస్పీ గృహాలు



శిథిలమై ముళ్లచెట్ల మధ్య ఉన్న పోలీస్ క్వార్టర్స్.. ఎన్నెస్పీ కార్యాలయంలో పాడైన ఉద్యోగుల వసతి భవనాలు.. కొనంకిలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం

మార్టూరు, జూన్ 10 : జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వ ఉద్యోగులు కోసం నిర్మించిన వసతి గృహాలు నేడు శిథిలమయ్యాయి. విలువైన స్థలాల్లో గతంలో ఏర్పాటు చేసిన వసతిగృహాలు నివాసానికి ఉపయోగంలేకుండా మారాయి. కనీసం ఈ భవనాలు కనిపించకుండా వాటి చుట్టూ ముళ్లచెట్లు, పొదలు పెరిగాయి. దాంతో వీటి పరిసరాల్లోని కొందరు వ్యక్తులు స్థలాన్ని ఆక్రమించేందుకు వేచిచూస్తున్నారు. ఈ భవనాలు నిర్మించే సమయంలో అక్కడ స్థలం ధర తక్కువగా ఉన్నా, ప్రస్తుతం అక్కడ స్థలం ధర సెంటు లక్షల్లో పలుకుతోంది. మార్టూరు మండలంలో మార్టూరులో పోలీస్ క్వార్టర్స్, కొనంకిలో ఎన్ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగుల వసతి భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి.

**మార్టూరులో పోలీస్ క్వార్టర్స్ శిథిలం**

దాదాపుగా 25 ఏళ్ల క్రితం మార్టూరులో జాతీయ రహదారికి తూర్పువైపున పోలీస్ స్టేషన్ ఉండేది. ఈ స్టేషన్ ఆవరణలో సుమారు అర ఎకరం స్థలం ఉండడంతో అప్పటి అధికారులు చొరవతో సుమారు 8 పోలీస్ క్వార్టర్ భవనాలను నిర్మించారు. వాటిలో ఎస్ఐ నివాసం ఉండడం కోసం కూడా ప్రత్యేకంగా క్వార్టర్‌ని నిర్మించారు. ఈ సమయంలో ఎస్ఐతో పాటు స్టేషన్‌లో పని చేసే కానిస్టేబుళ్లు కూడా ఆ భవనంలోనే ఉండేవారు. అయితే పోలీస్ స్టేషన్ ప్రాంతం జాతీయరహదారికి దిగువగా ఉండడం, పల్లంగా ఉండడంతో భారీగా వర్షం కురిస్తే అంతా నీటిమడుగులు ఏర్పడేది. పోలీస్ క్వార్టర్స్ పైకప్పులు దెబ్బతినడంతో తరచూ పోలీసు కుటుంబాలు ఇబ్బందిపడేవారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్ నిర్మాణం అంటే ఈ పోలీస్ క్వార్టర్స్‌కు ఎదురుగా జాతీయరహదారికి పడమరవైపు ప్రభుత్వ స్థలంలో నూతనంగా స్టేషన్ ఏర్పాటైంది. దాంతో పాతస్టేషన్‌ను కొత్త భవనంలోకి మార్చేశారు. అనంతరం స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐతో పాటు పలువురు కానిస్టేబుళ్లు గ్రామానికి దూరంగా ఉన్న, వసతులులేని కార్వర్టర్స్‌ని వదిలేసి గ్రామంలోని అద్దె ఇళ్లలో నివాసముంటున్నారు. ఆ తర్వాత వాటివైపు కన్నెత్తి చూసే పోలీసులు లేకపోవడంతో ఈ భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. అదీగాక ఈ క్వార్టర్స్‌ని పట్టించుకున్న అధికారులు లేకపోవడంతో మార్టూరులో పోలీస్ క్వార్టర్స్ ఉన్నాయనే సంగతిని పోలీసులతోపాటు ప్రజలు మర్చిపోయారు. పోలీస్ క్వార్టర్స్‌కు వెళ్లే దారిని కూడా కొంతమంది ఆక్రమించారు. శిథిలమైన పోలీస్ క్వార్టర్స్‌ని తొలగించి నూతన భవనాలను నిర్మిస్తే పోలీసు ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

**కొనంకిలో ఎన్ఎస్పీ ఉద్యోగుల నివాసాలు**

మండంలోని కొనంకి ఎన్నెస్పీ కార్యాలయ ఆవరణలోనే 25 ఏళ్ల క్రితం ఉద్యోగుల కోసం సుమారు 5 వసతి గృహాలను ఏర్పాటు చేశారు. ఎన్నెస్పీ కొనంకి సబ్ డివిజన్ పరిధిలో పనిచేసే ఉద్యోగులుకానీ, కొనంకిలో ఉన్న కార్యాలయంలో పనిచేసే వారు ఈ వసతి గృహంలో ఉండేవారు. ఐదేళ్లకే అవి శిథిలం కావడంతో ఉద్యోగులు ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. ఈ స్థలంలోనే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ భవనం ఉంది. అదికూడా శిథిలం అయింది. ఐనా అధికారులు ఉద్యోగులు నామమాత్రంగా కార్యాలయాన్ని వినియోగిస్తున్నారు. దాదాపుగా 40 సెంట్ల విస్తీర్ణం ఉన్న ఈ స్థలంలో భవిష్యత్‌లో ఎన్నెస్పీ ఉద్యోగుల కోసం, ఈ సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు ఉపయోగపడేలా కొత్తగా భవనాలు నిర్మిస్తే అందరికీ ఎంతో ప్రయోజనంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ ఆవరణలోని శిథిలమైన భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించి, ఉద్యోగులకు వసతిని కల్పిస్తే ఎంతో ఉపయోగంతోపాటు విలువైన ఎన్నెస్పీ స్థలాలు ఆక్రమణకు గురికావు. ఇప్పటికైనా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను తొలగించి అందరికీ ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## రేషన్ బియ్యం దారిమళ్లిస్తే సహించేది లేదు

**ఎమ్మెల్యే కొండయ్య**

చీరాల, జూన్ 10 : పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం దారి మళ్లిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం రేషన్ డీలర్లు కొండయ్యను కలిశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వ పరంగా రేషన్ దుకాణాల ద్వారా అందించే బియ్యం, కంది పప్పు, చక్కెర తదితరాలు నల్లబజారుకు తరలకుండా కార్డుదారులకు అందజేసే బాధ్యత డీలర్లపై ఉందన్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని యానాదికాలనీలో నెలనెలా రేషన్ సక్రమంగా పంపిణీ కావడం లేదని అక్కడి వారు తన దృష్టికి తెచ్చారన్నారు. రేషన్ బియ్యంకు ధర నిర్ణయించి డబ్బు తీసుకోండని లబ్ధిదారులకు చెప్పడం లాంటి అంశాలు పునరావృతం కాకూడదని డీలర్లకు సూచించారు. అందుకు డీలర్లు సానుకూలంగా స్పందించారు. నిబంధనల మేరకు నడుచుకుంటామని చెప్పారు. వారి సమస్యలను కొండయ్య దృష్టికి తెచ్చారు. అనంతరం కొండయ్యకు డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

## బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

అద్దంకి, జూన్ 10 : సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినోత్సవాన్ని సోమవారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణ యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బర్త్‌డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, మాజీ ఎంపీపీ మన్నెం ఏడుకొండలు, పట్టణపార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, గార్లపాటి శ్రీనివాసరావు, కాకాని అశోక్, వడ్డవల్లి రామారావు, లహరి, రామాంజనేయులు, బచ్చల వాసు పాల్గొన్నారు.

బల్లికురవ : పలు గ్రామాలలో సినీహీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. యువత కేక్ కట్ చేశారు. అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, ఉప్పుమాగులూరు, కొణిదెన తదితర గ్రామాలలో మిఠాయిలు పంచిపెట్టారు.

వేటపాలెం(చీరాల) : అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని శ్రీరామ్ త్రివిక్రమ్ మెమోరియల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు అన్నదానం చేశారు. అనంతరం ఆశ్రమంలోని వారికి టవల్స్‌ను పంపిణీ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు కౌతవరపు జనార్దనరావు, ప్రేమ్‌కుమార్, పూర్ణ, అంజనేయులు, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

మార్టూరు, జూన్ 10 : మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన వీబూది గిరీష్ (25) వివాహిత చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందినట్లు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. ఆమెకు భర్త, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. బొల్లాపల్లి గ్రామంలో గిరీష్ అనే మహిళ ఆదివారం అర్ధరాత్రి ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మ హత్యాయత్నం చేశారు. అనంతరం ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతిచెందినట్లు స్టేషన్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. గిరీష్ స్వగ్రామం పెద దర్శి. ఆరేళ్ల కిందట బొల్లాపల్లి గ్రామానికి చెందిన అంకమ్మరావుతో వివాహం అయింది. మద్యానికి బానిసైన అంకమ్మరావు తరచుగా భార్యపై చేయిచేసుకొని వేధించేవారు. ఈ విషయమై తనకుమార్తెను అల్లుడు అంకమ్మరావు మానసికంగా శారీరకంగా వేధించడంతోఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి కే పెదఅంజయ్య స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## కొమ్మమూరు కాలువ బ్రిడ్జిపై కూలిన రైలింగ్

- పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళనలో ప్రజలు, వాహనదారులు

కారంచేడు (పర్చూరు), జూన్ 10 : వాడరేవు పిడుగురాళ్ల రహదారిలోని కారంచేడు కొమ్మమూరు కాలువపై ఉన్న బ్రిడ్జి రైలింగ్ కూలి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈబ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం బ్రిడ్జిపై రైలింగ్ కూలిపోవడంతో వాహనదారుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణం కొంత శిథిలావస్థకు చేరడం, బ్రిడ్జి అంచులపై ఏర్పాటు చేసిన రైలింగ్ కూలిపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు. దీంతోపాటు, వృద్ధులు, చిన్నారులు సైతం ఈబ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జికి రైలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాని ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా ఆర్అండ్‌బీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అంసరం ఎంతైనా ఉంది.



బ్రిడ్జిపై కూలి ఉన్న రైలింగ్

## అరకొరగా వచ్చిన పాఠ్యపుస్తకాలు

- రేపు పాఠశాలలు పునఃప్రారంభం
- రాని టెన్త్ పీఎస్, 7వతరగతి పుస్తకాలు
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆందోళన




ఎంఆర్‌సీకి చేరిన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

అద్దంకిటౌన్, జూన్ 10 : విద్యా సంవత్సరం మరో రెండు రోజుల్లో ప్రారంభం కాబోతుంది. ఆయా పాఠశాలలలోని విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు అరకొరగా మండలానికి చేరాయి. మండలంలో మొత్తం 76వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అవసరంకాగా వాటిలో కేవలం 56 వేల మంది విద్యార్థులకు మాత్రమే పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి. దీనికితోడు పలు తరగతులకు అసలు పాఠ్యపుస్తకాలు రాకపోగా మరో తరగతికి సంబంధించి ఒక సబ్జెక్ట్ పుస్తకాలు రాలేదు. దీంతో పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో పుస్తకాలు రాకపోతే ఎలా అని విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అద్దంకి మండలంలో మొత్తం ప్రభుత్వ పాథమిక పాఠశాలలు 65 ఉన్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 13 ఉన్నాయి. వీటితోపాటు ఎయిడెడ్ పాఠశాలలు మూడు ఉన్నాయి. వీటి అన్నింటికీ సంబంధించి రానున్న 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొత్తం పాఠ్యపుస్తకాలు అరకొరగా మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చాయి. మండల విద్యాశాఖ అధికారులు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుంచి 10వ తరగతివరకు 76 వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అవసరమని రాష్ట విద్యాశాఖకు తెలిపారు. వాటిలో కేవలం 56వేల మందికి మాత్రమే పాఠ్యపుస్తకాలను పంపారు. వాటిలోను 7వతరగతికి సంబంధించి ఒక్క పాఠ్యపుస్తకం కూడా రాలేదు. అలాగే పదవ తరగతి పీఎస్ సబ్జెక్టుకు పుస్తకాలు రాలేదు. మరో రెండు రోజులల్లో పాఠశాలలు ప్రారంభం కాబోతుండగా నేటికీ అన్ని పుస్తకాలు రాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### 56వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయి

అద్దంకి మండలంలో 76వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అవసరం అని జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు తెలియజేశామని ఎంఈవోలు డీ గంగాధరరావు, బీ సుధాకరరావు తెలిపారు. వాటిలో ఇప్పటికి 56వేల మందికి మాత్రమే పుస్తకాలు వచ్చాయని, మిగిలిన పాఠ్య పుస్తకాలు త్వరలో వస్తాయన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 11,006 పాఠ్యపుస్తకాలు, 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు 15,610 పుస్తకాలు వచ్చాయన్నారు. ఏపీసీ ఆదేశాల మేరకు వారి కేటాయించిన తేదీలోపు అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా రాష్ట్ర విద్యాశాఖ తగు చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంఈవోలు కోరారు.



విద్యుత్ కాంతులతో ఎంపీడీవో కార్యాలయం

### కార్యాలయాలకు విద్యుత్ శోభ

బల్లికురవ. జూన్ 10 : టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువు దీరనున్న సందర్భంగా మూడు రోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ కాంతులను ఏర్పాటు చేస్తున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి సోమవారం రాత్రి విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో హనుమారెడ్డి పర్యవేక్షణలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

### మనస్తాపంతో మహిళ బలవన్మరణం

చీరాలటౌన్, జూన్ 10 : మనస్తాపంతో మహిళ బలవన్మరణం చెందిన సంఘటన ఆదివారం రాత్రి స్థానిక వైకుంఠపురం పోలేరమ్మ గుడి సమీపంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలశెట్టి పోలేరమ్మ (35) భర్త శివకుమార్ నాలుగేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయారు. ఆమె అప్పటి నుంచి స్వల్ప అనారోగ్యానికి గురైంది. ఈక్రమంలోనే జీవితంపై ఆశ చంపుకుని ఇంట్లోనే పురుగు మందు తాగింది. స్థానికులు ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లిదండ్రులు కూడా మృతిచెందడంతో ఒక్కగానొక్క 15 ఏళ్ల కుమారుడు ఒంటరిగా మిగిలి హాస్పిటల్ వద్ద విలపిస్తున్నాడు.



శ్రీశైలంలో పూజలు చేస్తున్న గొట్టిపాటి కుటుంబ సభ్యులు

### శ్రీశైలంలో గొట్టిపాటి ప్రత్యేక పూజలు

అద్దంకి, జూన్ 10 : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సోమవారం కుటుంబసభ్యులతో కలిసి శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం గొట్టిపాటి రవికుమార్, ఝాన్సీ దంపతులు, పూజారులు ఆశీర్వదించారు.

### ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు

అద్దంకి, జూన్ 10 : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను 13వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి మాధవరావు, శింగరకొండ వాసవీ ఆర్యవైశ్య అన్నదాన సత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు భోజనపల్లి సత్యనారాయణ, టీడీపీ ఆర్యవైశ్య నేతలు మామిడి రాంబాబు, పొట్టి శివ తదితరులు బల్లికురవలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### రవికుమార్‌ని కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను ఏపీటీఎఫ్ మండల నేతలు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీటీఎఫ్ నాయకులు మలాది నాగరాజు, కరి రామయ్య, అనపర్తి రమేష్‌బాబు, కె.మల్లికార్జునరావు, శ్రీహరి, శంకరరావు, రాజశేఖర్, సుబ్బారావు, కోటేశ్వరరావు, రాఘవయ్య, అంకయ్య, వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేని కలిసినవారిలో ఉన్నారు.

## ఉత్సాహంగా ఎడ్ల పందేలు



పోటీపడుతున్న సోపిరాల ఎద్దు

చినగంజాం, జూన్ 10 : మండలంలోని సోపిరాల గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని నాటుబండి పోలురాధ బల ప్రదర్శనలో సోమవారం ఎడ్లు పోటీ పడ్డాయి. ఆలయ ప్రాంగణంలో జరిగిన మండల స్థాయి పోటీలకు కడవకుదురు, సోపిరాల, పెదగంజాం, రాజుబంగారుపాలెం, చినగంజాం, కుక్కలవారిపాలెం తదితర గ్రామాలకు చెందిన 14 ఎడ్ల జతలు పోటీలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు, గ్రామస్థుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలను గ్రామ బైరు బండ్ల యూనియన్ నాయకులు ఆమంచి బ్రహ్మయ్య, గంటా సుబ్బారావు ప్రారంభించారు. ఎడ్ల పందేలు గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని వారు అన్నారు. యువకులు, పెద్దల ఈలలు, కేరింతలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ పోటీలను ఉత్సాహంగా తిలకించారు. పోటీలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు మంగళవారం బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. న్యాయనిర్ణేతగా తంగేడి హాసన్, వ్యాఖ్యాతగా తుమ్మలపెంట చిన్నాలు వ్యవహరించా రు. పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన ఎడ్ల జత యాజమానులను నిర్వాహకులు శాలువాలు కప్పి సన్మానించారు. సోపిరాల గ్రామ బైరుబండ్ల యూనియన్ అధ్యక్షుడు తుమ్మలపెంట జయరావు, సభ్యులు చెరుకూరి భాస్కరరావు, ఆమంచి ఏసు, సీహెచ్ అంకమ్మ, రాంబాబు, కృష్ణ, అప్పారావు, శివశంకర్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు.



ఎమ్మెల్యే గొట్టిపాటికి స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

## మీ కృషితోనే అఖండ విజయం

- ఎమ్మెల్యే గొట్టిపాటి
- ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- ఘనస్వాగతం పలికిన టీడీపీ కార్యకర్తలు, అధికారులు

బల్లికురవ. జూన్ 10 : ఎన్నికలలో టీడీపీ కూటమి అఖండ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికలలో ఘన విజయం సాధించిన అనంతరం సోమవారం తొలిసారిగా బల్లికురవ మండలానికి వచ్చిన గొట్టిపాటికి నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్, గొట్టిపాటి హనుమంతురావు విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. గ్రామాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన శ్రేణులను ఎమ్మెల్యేగా విడివిడిగా కలిసి తన గెలుపునకు శ్రమించినవారిని అభి నందించారు. కొరిశపాడు మండలం పమిడిపాడు నుంచి పెద్ద ఎత్తున వాహనాల్లో వచ్చి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కృషి చేసిన వారందరికీ అండగా ఉంటానన్నారు. పలు శాఖల అధికారులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి శంకర్, అమరనేని కాశియ్య, మాలపాటి పోతురాజు, గొట్టిపాటి లక్ష్మయ్య, అంజిరెడ్డి, దద్దాల అంజయ్య, జూపల్లి రాఘవరావు, ధూళిపాళ్ల బుల్లిరామయ్య, పుచ్చకాయల సుబ్బరామయ్య, ఆళ్ల చంద్రమౌళి, ముండ్రు దానయ్య, జాష్టి శ్రీరంగనాయకులు, పత్తిపాటి వెంకట్రావు, ఏడుకొండలు, భైరపునేని ఆజయ్, హనుమంతురావు, యాగంటి సింగరయ్య, కోట శ్రీనివాసరావు, అరవింద్‌కుమార్, అబ్రహం పాల్గొన్నారు.

**కాబోయే మంత్రి అంటూ నినాదాలు**

కాబోయే మంత్రి గొట్టిపాటి అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. కష్టకాలంలో కూడా పార్టీ కోసం ముందుండి నిలిచిన ఎమ్మెల్యేకి మంత్రి పదవి ఖాయమంటూ పలువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**శుభాకాంక్షలు తెలిపిన పమిడిపాడు మహిళలు**



ఎమ్మెల్యేని అభినందిస్తున్న పమిడిపాడు టీడీపీ మహిళలు

మేదరమెట్ల : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను పమిడిపాడు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తారు. సోమవారం పమిడిపాడు నుంచి పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు రవికుమార్‌కు పూల మాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో వచ్చిన గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి పమిడిపాడు గ్రామంలోనే తెలుగుదేశం పార్టీకి 1147 మెజార్టీ వచ్చింది. ఈ సందర్భంగా గ్రామంలోని తెలుగుదేశం కార్యకర్తలు తమ ఆనందాన్ని రవికుమార్‌తో పంచుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ ఆధ్వర్యంలో 7 బస్సులు, 15 కారు, పెద్ద సంఖ్యలో ద్విచక్రవానాల్లో బల్లికురవ వెళ్లారు. గ్రామంలో మహిళా కార్యకర్తలు ఊరేగింపు అనంతరం వెళ్లారు. కార్యక్రమంలో పిన్నక శ్రీనివాసరావు, విక్రం కృపానాగేశ్వరరావు తోపాటు మహిళలు ఉన్నారు.

## తైక్వాండో విజేతలకు అభినందనలు



పతకాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కోచ్

కొత్తపేట(చీరాల), జూన్ 10 : ఏకే అండ్ వీకే కళాశాల విద్యార్థులు పలువురు ఆదివారం రేపల్లె భోగి ధర్మ తైక్వాండో అకాడమీలో జరిగిన తైక్వాండో పోటీలలో విజేతలుగా నిలిచారు. ఈ నేపథ్యంలో సోమవారం కళాశాలలో జరిగిన క్యాక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శైలజవాణి విజేతలను అభినందించారు. కోచ్ శాంతివరప్రసాద్ మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో పోటీలో గెలుపొందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారం అభినందనీయం



వైద్యాధికారికి డ్రెస్సింగ్ మెటీరియల్‌ను అందజేస్తున్న లక్ష్మీనారాయణ

చినగంజాం, జూన్ 10 : ప్రాథమిక వైద్యశాలకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోపిరాల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ డ్రెస్సింగ్ మెటీరియల్‌ని సోమవారం అందజేశారు. దాతలు అందజేసిన మెటీరియల్ వైద్యశాలకు వచ్చే పేద ప్రజలకు ఉపయోగపడునని వైద్యాధికారి తెలిపారు. సోపిరాల గ్రామానికి చెందిన దాత ఎన్ఆర్ఐ పల్లపోలు సురేంద్రకుమార్ సొంత నిధులతో సమకూర్చిన డ్రెస్సింగ్ మెటీరియల్‌ని ఆయన తండ్రి లక్ష్మీనారాయణ వైద్యాధికారికి అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు పీ సాయిశ్రీచరణ్, భవానీ, సీహెచ్‌వో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు చిరంజీవి, ఉల్దారాణి, ల్యాబ్ టెక్నీషియన్ శ్యాంసుందరబాబు, సిబ్బంది మురళి, మహేష్, సుబ్బారావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, టీడీపీ నాయకులు టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, శిఖరం హరిమోహన్‌రావు, నరహరి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పద్మనాభయ్య, గంటా వెంకటనారాయణ, ధర్మవరపు ఏసునారాయణ, గుండ్రెడ్డి నరసింహారావు, సిద్ధం రాము పాల్గొన్నారు.

### స్కిల్‌హబ్ సెంటర్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కొండపి, జూన్ 10 : కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో శిక్షణకు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ ఎంగోపీకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని వారు కోరారు.